TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

బుధవారం, అక్టోబర్ 07, 2026 | సంపుటి - 20 | సంచిక 363 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

ఇసిలో అభిప్రాయ భేదాలంటూ దుష్ప్రచారం

టిబిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు

హైదరాబాద్ : సర్ విషయంలో కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని టిబిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. ఫాం-6, ఫాం-7 లను భూతద్దంలో చూపిస్తూ.. ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. ఇవిఎంలను తీసుకువచ్చింది దివంగత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ అని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చనిపోయిన వాళ్ల ఓట్లను తీసివేయవద్దా రాహుల్ గాంధీ చెప్పాలని సూచించారు.

తరువాయి 2లో

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భ్రమరాంబికా అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడిని దేవస్థానం పాలక మండలి సభ్యులు, అధికారులు ఆహ్వానించారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

2లో

వైఎస్ జగన్ బీసీ ద్రోహి

జవైఎస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైస్ జగన్ బీసీ ద్రోహి అని తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు బుద్ధా వెంకన్న విమర్శించారు. జగన్ ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఐదేళ్ల పాలనలో బీసీలకు న్యాయం చేస్తానని చెప్పిన జగన్ మోసం చేశారని వెంకన్న ఆరోపించారు. ఓటమి భయంతో వైసీపీ తన అభ్యర్థులను నిలబెట్టే పరిస్థితిలో లేదని, అందుకే పదేపదే కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయాలని చూస్తున్నదని బుద్ధా వెంకన్న దుయ్యబట్టారు. నవంబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే రాష్ట్రానికి రావాల్సిన వందల కోట్ల రూపాయల కేంద్ర నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. వైసీపీ తన ఎన్నికల గుర్తు ఫ్యాన్‌కు బదులుగా గొడ్డలి పెట్టుకోవాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ సౌకర్యాలు

2లో

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

కుత్బుల్లాపూర్‌లో 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు..

5,218 మంది అర్హుల నుంచి లక్కీడ్రా ద్వారా ఎంపిక

వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు: మంత్రి పొంగులేటి

మేడ్చల్, అక్టోబర్ 06 : పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను ఏడాదిలోపే పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఏడాది గడువు నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణీత గడువు కంటే ఒక నెల ముందుగా నిర్మాణాన్ని పూర్తి చేసే కాంట్రాక్టర్లకు రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షల ప్రోత్సాహక బహుమతి అందిస్తామని చెప్పారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7 వేల మందికి పైగా దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించిన అనంతరం 5,218 మందిని అర్హులుగా గుర్తించినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగ లక్కీ డ్రా ద్వారా నిర్వహించి 480 కుటుంబాలను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలతోపాటు అవసరమైన ధ్రువపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం 480 ఇళ్ల కేటాయింపుతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ముగియదని పొంగులేటి స్పష్టం చేశారు.

2లో

ఎర్రవల్లి ఆ భూముల లెక్కలు తేల్చండి

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

సిద్దిపేట : సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల భూముల అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (ంవశ్రీఖఅస్త్రుఅ జవీ =వఋుత్ప్ర =వసఎఎ) ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు గ్రామాల్లో సర్వే వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ - 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉందని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారని అన్నారు. ఈ సర్వే నంబర్‌లో 45 ఎకరాల భూమి కనిపించలేదని అధికారులు చెప్పుకొచ్చారు. ఆ 45 ఎకరాలు ఎక్కడుందో తేల్చాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆ భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో భాగంగానే ఆ భూమి సరిహద్దులో ఉన్న మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు సబ్‌మిట్ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు.

తరువాయి 2లో

చలో లోక్‌భవన్ ర్యాలీకి తరలిరండి

న్యూఢిల్లీ : ఓట్ల సవరణ ప్రక్రియలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయన రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 8న నిర్వహించే చలో రాజ్‌భవన్ ర్యాలీకి పెద్ద ఎత్తున తరలిరావాలని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

2లో

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కొత్త చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

ఈ నెల 31న బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నూతన చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నూతన చీఫ్‌ను చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్‌గా పిలుస్తారు. అశుతోష్ దీక్షిత్ ఈ నెల 31 మధ్యాహ్నం నుంచి ఈ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన 2028 డిసెంబర్ 31 వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

2లో

రాహుల్ గాంధీ సహా ఇండియా బ్లాక్

కూటమి నేతల అరెస్ట్

న్యూఢిల్లీ : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ వద్ద ఇండియా కూటమి నేతలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ సహా కీలక నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇండియా బ్లాక్ ఎంపీలు మంగళవారం పార్లమెంట్ నుంచి ఈసీఐ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని భావించారు. ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సహా వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలు, ఇతర నేతలు హాజరయ్యారు.

తరువాయి 2లో

ట్రూ అప్ ఛార్జీలు వెనక్కి తీసుకోవాలి

హైదరాబాద్ : విద్యుత్ కోతలు, పెరిగిన బిల్లులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై రూ.5,420 కోట్ల భారం మోపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. విద్యుత్ సంస్థల నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల తరఫున పోరాటం చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారని హరీశ్‌రావు తెలిపారు.

2లో

ఎర్రవల్లి ఆ భూముల లెక్కలు తేల్చండి

సర్వే నంబర్ - 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. సర్వే నంబర్-325లో తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణం చేయాలని సీఎం ఆదేశించారు. తెలంగాణ అమరవీరుల కాలనీలో అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని ఆదేశించారు. జూన్ 2వ తేదీలోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

చలో లోక్‌భవన్ ర్యాలీకి తరలిరండి

సేవ్ డెమోక్రసీ పేరుతో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపులో భాగంగా 8న చలో లోక్‌భవన్ (రాజ్‌భవన్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన మంగళవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలిపారు. 8న ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, సభ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఇండియా కూటమి ప్రతినిధులు పాల్గొంటారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కొత్త చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌గా ఉన్న అమర్‌ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న రిటైర్ అవుతారు. అదే రోజు అశుతోష్ దీక్షిత్ పదవి చేపడతారు. ప్రస్తుతం ఎయిర్ మార్షల్‌గా ఉన్న దీక్షిత్.. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఎయిర్‌ఫోర్స్‌లో సేవలందిస్తున్నారు. 1966లో జన్మించిన ఆయన 1986లో ఎయిర్‌ఫోర్స్‌లో చేరారు. మిరాజ్-2000, జాగ్వార్, తేజస్, హాక్, అవ్రో, కిరణ్ వంటి అనేక యుద్ధ విమానాలను నడిపారు. దాదాపు 3,500 గంటలపాటు ఈ విమానాల్ని నడిపిన అనుభవం ఆయనది. అక్టోబర్ 8న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 94వ వార్షికోత్సవం ఉంది. ఈ సమయంలో కొత్త ఎయిర్ స్టాఫ్ చీఫ్‌ను ప్రభుత్వం నియమించడం విశేషం. దీక్షిత్.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు 29వ చీఫ్. భారత వాయుసేనలో దీక్షిత్ అనేక హోదాల్లో పని చేశారు. సౌత్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ద ఎయిర్ స్టాఫ్ (ప్రాజెక్ట్స్), అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ద ఎయిర్ స్టాఫ్ (ప్లాన్స్) సహా అనేక బాధ్యతలు నిర్వర్తించారు.

శ్రీశైలం శరన్నవరాత్రులకు చంద్రబాబుకు ఆహ్వానం

ఆలయ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, పండితులు సీఎంను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ పండితులు సీఎంకు వేదాశీర్వచనం పలికారు. అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్ల వివరాలను సీఎం చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖఖూఅనంతరం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన నివాసంలో శ్రీశైలం ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈవో, వేద పండితులు కలిశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మంత్రి లోకేష్‌కు కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు.

మన్నె క్రిశాంక్ అరెస్ట్...

హైదరాబాద్, అక్టోబరు 6 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'ఓఖీ మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

ఏపీలో 12 నుంచి దసరా సెలవులు

విజయవాడ, అక్టోబరు 6 : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ దసరా పండుగ సందర్భంగా విద్యాసంస్థలకు సెలవులను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 12వ తేదీ నుంచి 21వ తేదీ వరకు స్కూళ్లకు సెలవులు ప్రకటించాయి. అక్టోబర్ 10వ తేదీన రెండో శనివారం, 11వ తేదీన ఆదివారం కావడంతో విద్యార్థులకు 2 రోజుల ముందుగానే.. అంటే 10వ తేదీ నుంచే దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. దసరా శరన్నవరాత్రుల వేడుకల సందర్భంగా విద్యార్థులకు కొన్ని రోజుల సెలవులు లభించనున్నాయి. మొత్తంగా 12 రోజుల పాటు సెలవుల విరామం అనంతరం, ఈ నెల 22వ తేదీన పాఠశాలలు మళ్లీ పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, క్రిస్టియన్ ఎయిడెడ్ స్కూళ్లకు క్రిస్మస్ సెలవుల ఉంటాయి కనుక ఇలాంటి స్కూళ్లకు దసరా సెలవుల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు ఉంటాయని అధికారులు వెల్లడించారు. విద్యార్థులు మాత్రమే కాదు, టీచర్లు సైతం తమ కుటుంబసభ్యులతో పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు అధికారులు. ఇంటర్ కాలేజీలకు సైతం బోర్డ్ షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 10 నుంచి 20 వరకు దసరా సెలవులు ఉంటాయి. అంతకుముందే క్వార్టర్లీ ఎగ్జామ్స్ కాలేజీలు నిర్వహించనున్నాయి. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 21న జూనియర్ కాలేజీలు రీఓపెన్ కానున్నాయి. నవంబరు 25 నుంచి 30 వరకు హాఫ్ ఇయర్ ఎగ్జామ్స్ నిర్వహించనున్నారు. ఈ తరువాత వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతికి కూడా ఎక్కువ రోజులు సెలవులు ఉంటాయని తెలిసిందే.

ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనికి అదనంగా ప్రభుత్వ, హౌసింగ్ శాఖకు చెందిన భూములను గుర్తించి పేదలకు ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకు సంబంధించి హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలోని 23 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. పేదల సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని చెప్పారు. పేదల అవసరాలను గుర్తించి వారికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పొంగులేటి తెలిపారు. లబ్ధిదారులు కూడా నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. తమ కళ్ల ముందే ఇల్లు నిర్మించబడేలా, నాణ్యమైన ఇంటిని సొంతం చేసుకున్నామనే సంతృప్తి కలిగేలా నిర్మాణ పనులు చేపట్టాలని చెప్పారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయడంతోపాటు నిర్మాణ నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పీ. గౌతమ్, కలెక్టర్ మను చౌదరి, అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై పలువురు లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రూ అప్ ఛార్జీలు వెనక్కి తీసుకోవాలి

బషీర్‌బాగ్ కాల్పుల ఘటనకు 26 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యమాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ కోతలు, రైతుల కష్టాలను చూసిన కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అప్పట్లో ఉచిత విద్యుత్ పేరుతో అర్ధరాత్రి సరఫరా చేసేవారని, తెలంగాణ వస్తే చీకట్లు అలముకుంటాయని విమర్శలు వచ్చేవని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం విద్యుత్ ఉంటే వార్తగా మారే పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఎల్‌నినోను సాకుగా చూపుతూ పాలన వైఫల్యాల నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ప్రకృతి వల్ల వచ్చిన కరువు కంటే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే రాష్ట్రంలో విద్యుత్, సాగునీటి సమస్యలకు కారణమని వ్యాఖ్యానించారు. 2016-17 నుంచి 2021-22 వరకు ట్రూ అప్ ఛార్జీల రూపంలో రూ. 12,718.40 కోట్లు వసూలు చేయాలని విద్యుత్ నియంత్రణ మండలి సూచించినప్పటికీ, మరిన్ని కనుగొనండి తాజా వార్తలు సేవ ఈ-పేపర్ సబ్‌స్క్రిప్షన్ వార్తల వీడియోలు ~ాశ్రీంశీ =ముం - మూడు ప్రశ్నలకు రాహుల్ సమాధానం చెప్పాలి కేసీఆర్ ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు అంగీకరించలేదని హరీశ్‌రావు తెలిపారు. విద్యుత్ సంస్థల ఆర్థిక భారాన్ని ప్రజలపైకి నెట్టవద్దని అప్పటి ప్రభుత్వం స్పష్టంగా నిర్ణయించిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలపై రూ. 5,420 కోట్ల భారం వేయడానికి సిద్ధమైందని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లను 24 గంటలు నడపాల్సి ఉండగా ఎనిమిది గంటలే నడుపుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కల్వకుర్తి ప్రాజెక్టు మోటార్ల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. బొగ్గు, నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోవడం నిర్వహణ వైఫల్యమేనని అన్నారు. విద్యుత్ రంగంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. టీజీ-ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను విక్రయించాలనే ప్రతిపాదనపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

వైసీపీలో జలధార వణుకు

కడప : కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగుపెట్టి అమరజీవి జలధార పథకానికి శ్రీకారం చుట్టడం చూసి తాడేపల్లి సహా స్థానిక వైసీపీ నేతలకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. పల్లెల్లోని ప్రతి గడపకూ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి దాహం తీర్చే బృహత్తర కార్యక్రమం తమ ఇలాకాలో మొదలవుతుంటే.. అయ్యో, వీళ్లు ఇంత మంచి పని చేస్తే ఇక కడప గడ్డపై మా ఉనికేం కావాలి.. మా ప్యాలెస్ పలుకుబడి ఏమైపోవాలి అన్న భయం వైసీపీ నేతలను నిలువునా దహించివేస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజల్లో తమ పరపతి ఎక్కడ గల్లంతవుతుందోనన్న బెంగతో చిత్రవిచిత్ర విన్యాసాలకు తెరలేపారు. తాము అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాయలసీమకు చేసిందేమీ లేకపోయినా.. ఇప్పుడు కూటమి సర్కార్ రాయలసీమ రైజింగ్ కింద సుమారు లక్ష కోట్ల భారీ ప్రణాళికతో హార్టికల్చర్ హబ్, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుడుతుంటే వైసీపీ తట్టుకోలేకపోతోంది. ప్రభుత్వం ఒక విజన్‌తో అడుగులు వేస్తుంటే, దాన్ని డైవర్ట్ చేసేందుకు తమదైన ఫేక్ ఫ్యాక్టరీకి పనిచెప్పారు. ప్రొద్దుటూరు పరిసరాల్లో అర్ధరాత్రి వేళ దొంగచాటుగా వెళ్లి.. పంటలు ఎండిపోతున్నాయి.. రూ. లక్ష కోట్లు ఎక్కడ అంటూ వింత పోస్టర్లు పొలాల్లో పెట్టారు. ఆ వీడియోలు తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఇందులో అసలైన కామెడీ ఏమిటంటే.. ఆ పోస్టర్లు వేసింది తామేనని చెప్పుకునే కనీస దమ్ము, ధైర్యం కూడా వైసీపీ నేతలకు లేకపోవడమే! పోస్టర్ల కింద దర్జాగా పార్టీ పేరు గానీ, పార్టీ గుర్తు గానీ పెట్టుకోలేక.. రాయలసీమ రైతులు అనే ముసుగు తగిలించుకుని దొంగచాటు రాజకీయం నడుపుతున్నారు. ఆ పోస్టర్లు వేయించింది ఎవరో, ఆ స్క్రిప్ట్ ఎవరిదో పసిగట్టడానికి ప్రజలకు పెద్దగా పరిశోధనలేమీ అక్కర్లేదు. రాజకీయాల్లో విమర్శలు చేయాలంటే గుండెల నిండా ధైర్యం ఉండాలి, కానీ ఇలా రైతుల పేరుతో తెరవెనుక దాక్కుని దొంగ పోస్టర్లు అంటించడం వైసీపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ప్రజల ముందుకు వచ్చి మాట్లాడే మొహం లేక, ఇలా ట్యాగ్‌లైన్ల వెనుక దాక్కోవడం కడప రాజకీయ చరిత్రలోనే ఒక వింత రికార్డు అనే సెటైర్లు వినిపిస్తున్నాయి. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ కడప జిల్లా రైతులే కాదు, చివరకు పులివెందుల రైతులు కూడా సాగునీరు, తాగునీరు అందక నానా ఇబ్బందులు పడ్డారు. ఆ ఐదేళ్లూ నోరు మెదపని నాయకులు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సీమను సస్యశ్యామలం చేసేందుకు నిధులు సమకూరుస్తుంటే ఓర్వలేకపోతున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిల్లాకు చేసిందేమీ లేకపోయినా, ఇప్పుడు ఇంటింటికీ కుళాయి నీరు, రైతులకు ఉద్యానవన ప్రాజెక్టులు వస్తుంటే మాత్రం పోస్టర్లు వేసి సంతృప్తి పడుతున్నారు. గ్రామాల్లో ఫ్యాన్ ఖాళీ 2024 ఎన్నికల సమయం లో తాడేపల్లిగూడెం లో నిర్వహించిన కూటమి సభ కూటమి పార్టీల అభిమానులకు ఒక మధుర జ్ఞాపకం అని చెప్పొచ్చు. పవన్ కళ్యాణ్ ఎంతో ఆవేశంతో వైసీపీ పార్టీ ని పాతాళంలోకి తొక్కకపోతే నా పేరు పవన్ కళ్యాణ్ కాదు , నా పార్టీ జనసేన కాదు అని పెద్ద సవాల్ విసరడం వంటివి మనం అంత తేలికగా మనం మర్చిపోగలమా చెప్పండి. అప్పట్లో ఈ సవాల్ ని వైసీపీ వాళ్ళు చాలా కామెడీ గా తీసుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వాళ్లకు మబ్బులు వీడిపోయాయి. పవన్ కళ్యాణ్ చెప్పిందే చేసాడు కదా అని అప్పుడు బాధపడ్డారు. అయితే అది కేవలం టీజర్ మాత్రమే. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లో వైసీపీ ని ఖాళీ చేసే వ్యూహాన్ని రచించాడు పవన్ కళ్యాణ్. ఇప్పటికే గ్రామాల్లో వేల సంఖ్యలో వైసీపీ క్యాడర్ జనసేన పార్టీ కి షిఫ్ట్ అవుతూ వస్తోంది. గ్రామీణ ఎన్నికలు మొదలయ్యేలోపు వైసీపీ క్యాడర్ మొత్తాన్ని జనసేన కి షిఫ్ట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ వేసాడు పవన్ కళ్యాణ్. ఇదే కనుక జరిగితే జగన్ కి చావుదెబ్బ నే అని చెప్పొచ్చు. మాజీ సీఎం జగన్ తాను గతం లో చేసిన తప్పులు , పొరపాట్లను సరిదిద్దుకొని , ముందుకు వెళ్తే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. తాను ఇప్పటికీ అద్భుతమైన పాలన ని అందించానని , దొంగ ఈవీఎం లు వాడి కూటమి పార్టీలు అధికారం లోకి వచ్చాయనే ఊహల్లోనే జగన్ మరియు ఆయన అనుచరులు ఉన్నారు. ఇలాంటి ఊహల్లో ఉన్నంత కాలం టీడీపీ , జనసేన పార్టీ లకు తిరుగు ఉండదు అనే చెప్పాలి. విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పరిస్థితి ఎలా తయారైందో చూస్తూనే ఉన్నాం. మన కళ్ల ముందే ఆ పార్టీ కుప్పకూలిపోయింది. వైసీపీ క్యాడర్ మొత్తం ఇప్పుడు టీడీపీ సొంతమైంది. అతి త్వరలోనే బొత్స సత్యనారాయణ జనసేన పార్టీ లో చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అదే కనుక జరిగితే విజయనగరం జిల్లాలో వైసీపీ పార్టీ పునాదులతో సహా కొట్టుకుపోయినట్టే అని చెప్పొచ్చు. ఇదే తరహా ఆపరేషన్ ని టీడీపీ , జనసేన అన్ని జిల్లాల్లోనూ చేస్తోంది. ముఖ్యంగా జనసేన పార్టీ లో స్పేస్ ఎక్కువ ఉండడం తో వైసీపీ బడా లీడర్లు చేరుతున్నారు. అనుకున్నది అనుకున్నట్టు చేస్తే వచ్చే ఏడాది లో పాదయాత్ర చేస్తానన్న జగన్ కి చుక్కలు కనిపిస్తాయి. ఎందుకంటే అత్యధిక శాతం వైసీపీ క్యాడర్ టీడీపీ , జనసేన పార్టీల్లో ఉంటాయి , పాదయాత్ర కి కావాల్సినంత డబ్బు పెట్టే నాయకులు కూడా ఉండరు. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

హిజ్రాల దందాలో పురుషులు...

హైదరాబాద్ : హైదరాబాద్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. తాజాగా జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ ఃఓచి కారును అడ్డుకుని డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు మహిళల మాదిరిగా చీరలు ధరించి, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వేషధారణలో రోడ్డుపైకి వచ్చారు. అనంతరం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఓ ఃఓచి కారును అడ్డుకుని అందులో ఉన్న వ్యక్తి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నలుగురు కలిసి కారును అడ్డుకోవడంతో వాహనదారుడు ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. ఈ వీడియోపై స్పందించిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు. అనంతరం కారును అడ్డుకున్న నలుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రాథమిక విచారణలో వారు పురుషులేనని, డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో మహిళల మాదిరిగా దుస్తులు ధరించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో డబ్బులు అడుగుతున్న కొందరి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు గతంలోనూ వచ్చాయి. కొన్నిసార్లు డబ్బులు ఇవ్వకపోతే ఒత్తిడి చేయడం, వాహనాలను అడ్డుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల ఓ గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లిన కొందరు వ్యక్తులు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసిన ఘటన కూడా చర్చనీయాంశంగా మారింది. ఒక మహిళను ఇబ్బంది పెట్టి రూ. 50 వేల వరకు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇలాంటి ఘటనలపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలనే డిమాండ్లు పెరిగాయి. అయితే ఈ ఘటనలను మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి ఆపాదించకూడదని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. చట్టవిరుద్ధంగా డబ్బులు వసూలు చేసే వ్యక్తులపై వారి లింగ గుర్తింపుతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. జూబ్లీహిల్స్ ఘటనలో నలుగురి అరెస్టుతో మరోసారి నగరంలో బహిరంగ ప్రదేశాల్లో డబ్బుల వసూళ్ల అంశం చర్చకు వచ్చింది. ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా వాహనాలను అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని పోలీసులు స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. వైరల్ వీడియో ఆధారంగా ప్రారంభమైన ఈ కేసులో తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

హైదరాబాద్ , అక్టోబరు 6 : తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు.

రాహుల్ గాంధీ సహా ఇండియా బ్లాక్ కూటమి నేతల అరెస్ట్

అయితే, వీరిని ఈసీఐ భవనం వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆకాశవాణి భవన్ వద్ద నేతలు ఆందోళనకు దిగారు. దీంతో వీరిని మంగళవారం రాత్రి ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాలు, పవన్ ఖేరా, అఖిలేష్ యాదవ్ వంటి నేతల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. నేతలు సహా కార్యకర్తలు, పోలీసులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

ఇసిలో అభిప్రాయ భేదాలంటూ దుష్ప్రచారం

ఎన్నికల సంఘంలో అభిప్రాయ బేధాలున్నాయని తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. బిహార్ లో ఏకాభిప్రాయంతోనే సర్ ప్రక్రియ జరిగిందని తెలియజేశారు. చనిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించడం తప్పా? అని కేరళ, కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో ఓట్ చోరీతోనే గెలిచారా? అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ ఓట్ చోరీతోనే ఎంపికయ్యారా? అని రామచందర్ ప్రశ్నించారు. గతంలో సిఐసి కేవలం ప్రధాని మాత్రమే ఎంపిక చేసేవారని.. తమరు కీలుబొమ్మలనే ఎంపిక చేశారా? అని ప్రశ్నించారు. ఫాం-7 ఇస్తే వెంటనే ఓటు డిలీట్ కాదని స్పష్టం చేశారని, ఫాం-7 ఇవ్వడం నేరం కాదని రామచందర్ రావు పేర్కొన్నారు.

వైఎస్ జగన్ బీసీ ద్రోహి

అందిస్తోందని బుద్దా వెంకన్న తెలిపారు. బీసీల సమస్యల్లో జోక్యం చేసుకోవద్దని జగన్‌ను హెచ్చరించిన వెంకన్న.. రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు జరిగిన అన్యాయాన్ని ఎండగడతామని అన్నారు. పోలీసు యంత్రాంగం బాగా పని చేస్తోంది కాబట్టే వైసీపీ నేతలు రోడ్లపైకి వచ్చి రంకెలు వేస్తున్నారని అన్నారు. పోలీసులు సరిగా పని చేయకపోతే వైసీపీ వాళ్లు రోడ్లపైకి వచ్చే సాహసం కూడా చేసేవారు కాదని చెప్పారు. పోలీసులను విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని బుద్దా వెంకన్న అన్నారు.

గవర్నర్ కోటలో సోషల్ ఇంజనీరింగ్

హైదరాబాద్ : తెలంగాణ శాసనమండలిలో నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నాయి. మూడు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో ఊహించని స్థాయిలో పోటీ నెలకొంది. ఇటీవలే ప్రకటించిన పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు రెండింటినీ రెడ్డి సామాజికవర్గానికే కేటాయించడంపై సోషల్ మీడియా వేదికగా, పార్టీ శ్రేణుల్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. అందుకే సామాజిక సమీకరణాలను దారిలోకి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలోని స్థానాలను పూర్తిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించే వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఈ నామినేషన్లలో తెలంగాణ ఉద్యమకారులకు, త్యాగాలు చేసిన కుటుంబాలకు ప్రాధ్యానమివ్వాలనే నిర్ణయం బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ తొలితరం ఉద్యమ నేత, ఆత్మగౌరవ ప్రతీక అయిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి గవర్నర్ కోటాలో ఓ ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన బాపూజీ కుటుంబానికి, వారి కుమార్తెకు ఈ అవకాశం కల్పించడం ద్వారా అటు ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని, ఇటు కీలకమైన బీసీ ఓటు బ్యాంకుకు స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మూడు స్థానాల భర్తీతో పార్టీలోని అసంతృప్తిని చల్లార్చడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా సామాజిక ప్రాతిపదికను సిద్ధం చేసుకోవాలని అధిష్టానం యోచిస్తోంది. పద్మశాలి, గౌడ, ముదిరాజ్ లేదా ఎస్సీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ నేతలు, కేడర్‌లో పట్టున్న ఉద్యమకారుల పేర్లను నివేదికల రూపంలో సేకరిస్తున్నారు. గ్రాడ్యుయేట్ స్థానాల్లో ఓపెన్ కేటగిరీకి ప్రాధాన్యత లభించడంతో, ఈ నోటిఫికేషన్‌లో అణగారిన వర్గాలకే పెద్దపీట వేయకపోతే సామాజిక న్యాయం నినాదానికి విఘాతం కలుగుతుందనే అభిప్రాయం పార్టీ అగ్రనేతల్లోనూ నెలకొంది. గవర్నర్ కోటా నామినేషన్ల చట్టబద్ధత, నియామకాల ప్రక్రియపై గతంలో కోర్టు కేసులు నడవడం, సుప్రీంకోర్టు పరిణామాలు కూడా ఈ నామినేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. న్యాయపరమైన అంశాలను అధిగమించి, రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి కళలు, సామాజిక సేవ, సాహిత్యం లేదా ప్రజా సేవలో అనుభవం ఉన్న బీసీ, ఎస్సీ నేపథ్యమున్న నాయకుల పేర్లను గవర్నర్ ఆమోదానికి సిఫార్సు చేయాలని మంత్రివర్గం సన్నాహాలు చేస్తోంది. నవంబర్ ఎమ్మెల్సీ రగడ కాంగ్రెస్ పార్టీకి అటు ఉద్యమకారులను ఆదుకోవడానికి, ఇటు సామాజిక న్యాయాన్ని నిలబెట్టుకోవడానికి ఒక రాజకీయ అవకాశంగా మారింది. కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి దక్కే అవకాశంతో పాటు మిగిలిన రెండు స్థానాల్లో ఎవరికి చోటు లభిస్తుందనేది తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. బీసీ, ఎస్సీల మేళవింపుతో కూడిన ఈ వ్యూహం ఫలిస్తే, రేవంత్ రెడ్డి మార్క్ సోషల్ ఇంజనీరింగ్‌కు క్షేత్రస్థాయిలో మంచి మైలేజ్ లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రోత్సవాల కరపత్రం ఆవిష్కరణ.

ధర్మపురి, అక్టోబర్ 6, (ది క్రైమ్ న్యూస్): ధర్మపురి పట్టణంలోని న్యూ టి.టి.డి కళ్యాణ మండపం బస్టాండ్ పక్కన వేదికగా నవదుర్గా సేవా సమితి నిర్వహించనున్న త్రయోదశ 13వ సంవత్సర దేవి శరన్నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం ఏం ఎల్ ఏ క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అమ్మ దయ తో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 11, 2026 నుండి అక్టోబర్ 20, 2026 వరకు ఈ నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరగనున్నాయని తెలిపారు. ఈ నవరాత్రోత్సవాలలో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

గాయపడిన శానిటేషన్ వర్కర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్): విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడిన శానిటేషన్ వర్కర్ నాగారం నరసింహను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. అక్టోబర్ 2న ఉదయం హబ్సిగూడలో రోడ్డు శుభ్రం చేస్తుండగా వేగంగా వచ్చిన వాహనం నరసింహను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న నరసింహను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరసింహ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయను కలిసి నరసింహకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు, నాగారం బాబు, ఎస్ఎఫ్ఏ ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో భూ సేకరణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ధర్మారం మండలం కానంపల్లి చెరువుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించి ఇంకా పరిష్కరించాల్సిన అంశాలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పెద్దపల్లి బైపాస్ రైతులతో చర్చలు... పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు నిర్వహించాలని సూచించారు. రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుని, వారికి అవసరమైన వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు రైతులు సహకరించాలి... పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం జిల్లా అభివృద్ధి, ప్రజల రవాణా సౌకర్యం దృష్ట్యా ఎంతో అవసరమైనదని తెలిపారు. అభివృద్ధి పనుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని రైతులు సహకరించాలని కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చట్ట ప్రకారం పరిహారం చెల్లింపు.. భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు చట్టం, నిబంధనల ప్రకారం అందాల్సిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులతో చర్చలు జరిపి, వారి సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడంతో పాటు, చట్ట ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన రికార్డులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలను శాఖల వారీగా సమీక్షిస్తూ నిర్ణీత సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ బి. గంగయ్య, తహసిల్దార్ రాజయ్య,అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ-భారతి రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో భూ-భారతి రీ-సర్వే అవగాహన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : భూ-భారతి రీ-సర్వే ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతి భూమి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, సమగ్ర భూ రికార్డులను రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా రైతులు, ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మంగళవారం ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో నిర్వహించిన భూ-భారతి రీ-సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని, రీ-సర్వే ఉద్దేశ్యం, చేపట్టనున్న ప్రక్రియ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని తెలిపారు. అనేక సంవత్సరాల అనంతరం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే నిర్వహించాలని నిర్ణయించిందన్నారు.భూముల హద్దులు, రికార్డులలో మార్పులతో సమస్యలు గతంలో ఒక సర్వే నంబర్‌లోని భూమి ఒకే వ్యక్తి వద్ద ఉండేదని, కాలక్రమేణా కొనుగోళ్లు, అమ్మకాలు, వారసత్వ బదలాయింపులు తదితర కారణాలతో భూములు అనేక చేతులు మారాయని తెలిపారు.పట్టాదారు పాస్‌పుస్తకాల్లో మార్పులు జరిగినప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రతి భూమికి సంబంధించిన ఖచ్చితమైన మ్యాప్ అందుబాటులో లేకపోవడం వల్ల భూముల విస్తీర్ణంలో తేడాలు, హద్దులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు.ఈ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా చేయడమే సమగ్ర రీ-సర్వే ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఖచ్చితమైన హద్దులను నిర్ధారిస్తామని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో తొలి దశలో 70 గ్రామాల్లో రీ-సర్వే... పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, మొదటి దశలో 70 గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ గ్రామాల్లో ఇందుర్తి కూడా ఒకటని పేర్కొన్నారు.రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అనంతరం ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులు, వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు. ఆధునిక సర్వే పరికరాల సహాయంతో భూముల హద్దులను ఖచ్చితంగా గుర్తించి సమగ్ర భూ రికార్డులను రూపొందిస్తామని వెల్లడించారు.సర్వే అనంతరం 21 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ రీ-సర్వే పూర్తయిన అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రజల పరిశీలనకు ప్రకటిస్తామని తెలిపారు. భూ వివరాలపై ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని, ఈ సమయంలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులను జారీ చేస్తామని తెలిపారు.భవిష్యత్‌లో భూములకు సంబంధించిన వివరాలు సులభంగా గుర్తించేందుకు, భూ హక్కులకు భద్రత కల్పించేందుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో 99 శాతం సమస్యల పరిష్కారం... రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే ద్వారా సుమారు 99 శాతం భూ సమస్యలను పరిష్కరించగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూముల విస్తీర్ణం, హద్దులు, ఇతర భూ సంబంధిత సమస్యలకు రీ-సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ-భారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. రీ-సర్వే ద్వారా రూపొందించే ఖచ్చితమైన భూ రికార్డులు భూ-భారతి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. రోజుకు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే... రీ-సర్వేలో భాగంగా రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. ఏ భూములను, ఏ సమయంలో సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేస్తామని చెప్పారు.సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలతో రైతులు అందుబాటులో ఉండటం వల్ల సర్వే ప్రక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తవుతుందని తెలిపారు.రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా పకడ్బందీగా రూపొందించనున్నట్లు తెలిపారు. ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక గుర్తింపుగా భూధార్ కార్డుల జారీకి ఈ రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు.భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.రీ-సర్వే సమయంలో అధికారులు, సర్వే సిబ్బందికి రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని, భూ వివరాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత ప్రక్రియలో వాటిని తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజ,సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

దాసరి ' కుట్రలో భాగమే బీసీలపై దాడులు

వ్యక్తిగత దాడులు కాదు బీసీ సమాజం పైనే దాడులు

దాడులను ఖండిస్తూ నాలుగు బీసీ సంఘాల సంయుక్త ప్రకటన

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన బిఆర్ఎస్ పార్టీ బీసీల సమావేశంలో బీసీలపై జరిగిన దాడులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రేరేపిత దాడులేనని నాలుగు బీసీ సంఘాలు సంయుక్తంగా ఖండించాయి.మంగళవారం పెద్దపెల్లి ఆర్కే గార్డెన్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తాడూరు శ్రీమన్నారాయణ తో పాటు పెద్దపల్లి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నల్లవెల్లి శంకర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కందుల సదాశివ్, రాష్ట్ర జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిని రాజేశం లు దాసరి మనోహర్ రెడ్డి వ్యవహార శైలిపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి బీసీలపై ప్రేరేపిత దాడులే కాకుండా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును బీసీలపై నమోదు చేయాలని పెద్దపల్లి పోలీసులపై ఒత్తిడి చేయడం బీసీలపై దాసరి అక్రోషం ఎంత ఉందో తెలుస్తుందని వారన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు దాసరి మనోహర్ రెడ్డి వ్యక్తులే నమోదు చేశారు కాబట్టి సంబంధిత కేసును మనోహర్ రెడ్డి ఉపసరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీసీలపై పెట్టిన కేసులు ఉపా సంహరించుకునే దానుక జిల్లాలో బీసీ ఉద్యమాలను లేవదీస్తామని నాలుగు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సంయుక్తంగా పేర్కొన్నారు. బిఆర్ఎస్ బిసి నేతలు సమావేశమైనప్పటికీ జరిగిన సంఘటన బీసీ సమాజంపై దాడి చేసినట్లుగా ఉందని వారన్నారు. భవిష్యత్తులో ఆయా రాజకీయ పార్టీల ఆధిపత్య వర్గాల వారు బీసీలపై ప్రేరేపిత దాడులు చేస్తే వారికి రాజకీయ జీవితాలకు బొంద పెట్టడం ఖాయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలపై దాడులను నిరసిస్తూ బీసీ రక్షణ చట్టం తేవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని ఈ సమావేశం ద్వారా డిమాండ్ చేశారు. బీసీ సమావేశంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ ఎస్సి నాయకులు మనోహర్ రెడ్డి కుట్రలో భాగంగా బిసి వర్గాల వ్యక్తులపై కేసులు పెట్టడం ఎస్సీ బీసీల మధ్య ఉన్న సోదర భావాన్ని విడదీయడానికే అని వారు పేర్కొన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పెరుగుతున్న బీసీ భావజాలం సహించలేకనే ఆధిపత్య కులాల రాజకీయ నేతలు కుట్రలో భాగంగానే కావాలనే హింసాత్మక దాడులకు ఉసిగొలుపుతున్నారని వారు అన్నారు. బీసీ సమాజం ఆధిపత్య కులాల కుట్రలను భగ్నం చేస్తూ ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. బీసీల మధ్యన ఐక్యత చెడ కొట్టడానికి కులాల మధ్యన చిచ్చు రేపుతున్న వారిపై బీసీ సమాజం సూక్ష్మ దృష్టితో ఆలోచించి వారి కుట్రాలను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు ఆధిపత్య వర్గాల వారి ఉచ్చులో పడి కనీసం కనీస విశ్లేషణ లేకుండా మనం తీసుకునే నిర్ణయాలు మన బీసీల భవిష్యత్తును అందాకారములో నెడుతున్నారని ఆవేదన చెందారు.ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల బీసీ నేతలైన కందుల అశోక పటేల్, చర్లపల్లి సురేష్ గౌడ్, శంకర్ గౌడ్ ,రాజేందర్, సురేష్, బొల్లం భూమేష్, సురేష్ విశ్వకర్మ, మహేష్, పెద్దపల్లి మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడగొని శ్రీనివాస్ గౌడ్, బొడ్డుపల్లి లక్ష్మణ్, తదితర బీసీ సంఘాల ప్రతిదులు లతోపాటు 11 వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అదనపు తరగతి గదులు

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్) : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని కలెక్టర్ సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలలు, మరుగుదొడ్ల వివరాలను ప్రిన్సిపల్ నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ మొత్తం మూడు ఎకరాల విస్తీర్ణంలో కొనసాగుతోందని ప్రిన్సిపల్ వివరించారు. ప్రస్తుతం ఉదయం ఇంటర్మీడియట్ తరగతులు, మధ్యాహ్నం డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు, ప్రయోగశాలలు ఇతర వసతులు సరిపడా ఉన్నప్పటికీ మరో ఏడు తరగతి గదులు అవసరమని తెలిపారు. వీటిని కాలేజీ భవనం పై అంతస్తులో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి అంచనాలు రూపొందించేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను పంపిస్తానని తెలిపారు. అధికారులు పరిశీలన అనంతరం రూపొందించే అంచనాలతో కూడిన ప్రతిపాదనలను తనకు పంపించాలని సూచించారు. కాలేజీలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ నాగేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో రోగుల రద్దీకి అనుగుణంగా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.రోగుల సంఖ్య పెరిగినప్పటికీ వైద్య చికిత్స నాణ్యతలో వైద్యులు, సిబ్బంది రోగులతో వ్యవహరించే తీరులో ఎలాంటి మార్పు రాకూడదని స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల రద్దీ, వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. వివిధ విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులతో ఓర్పుగా, మర్యాదగా వ్యవహరించాలి... ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఓర్పుతో, మర్యాదగా పలకరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పేద ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.రోగుల సంఖ్య పెరిగినప్పటికీ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది రోగులతో మాట్లాడే విధానంలో ఎలాంటి మార్పు రాకూడదని స్పష్టం చేశారు. ప్రతి రోగి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, వారి అవసరాలను ఓర్పుతో అర్థం చేసుకొని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సేవలను అభినందించిన కలెక్టర్... పెరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత తదితర అంశాలను పరిశీలించారు.విద్యార్థుల హాజరుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రాథమిక స్థాయిలోనే పటిష్టమైన విద్యా పునాది... ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఖీచీ) నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులకు నిర్దేశిత సమయంలోగా సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. బోధించిన పాఠ్యాంశాలపై సమగ్ర పునశ్చరణ నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పరీక్షల సన్నద్ధత కోసం త్వరలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన అదనపు సహాయం అందించాలని తెలిపారు.ఈ ఆకస్మిక తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు విజయవంతానికి కార్యాచరణ

- ఉప్పల్‌లో బీజేపీ సన్నాహక సమావేశం

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్ : మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమానికి సంబంధించి ఉప్పల్ నియోజకవర్గ సన్నాహక సమావేశం మంగళవారం మల్లాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఉప్పల్ అసెంబ్లీ ఓటర్ ఎన్రోల్మెంట్ కన్వీనర్ గొనె శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి కన్వీనర్లు, కో-కన్వీనర్లు హాజరయ్యారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేలా చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటిపల్లి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. రాబోయే మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ నమోదు ప్రక్రియ ప్రాధాన్యత, అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించే విధానం, డివిజన్‌ల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు వివరించారు. ఓటర్ నమోదు ప్రక్రియలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ మహేందర్, కో-కన్వీనర్ శ్రీవాణి కూడా సమావేశంలో పాల్గొని ఓటర్ నమోదు ప్రక్రియకు సంబంధించిన అంశాలను వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి, అర్హత ఉన్న వారిని నమోదు చేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించేందుకు డివిజన్ వారీగా బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలిపారు. గొనె శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో-కన్వీనర్లు రజినీకాంత్ రెడ్డి, మల్క ప్రకాష్, గీతారాణి తో పాటు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎన్నికల డివిజన్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డివిజన్‌ల వారీగా గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలను సేకరించి, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించడంపై దృష్టి సారించాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శైలేష్ రెడ్డి, మార్నినేని ఫణీంధర్, దప్పు దత్తసాయి, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు అనిత పద్మారెడ్డి, కాసుల సురేందర్ గౌడ్, వినోద్, బీజేపీ సీనియర్ నాయకులు గొనె అంజయ్య, ఎనుమల మహేష్, గడ్డం సాయి కిరణ్, బెకిరి రవీందర్ రెడ్డి, విద్యాసాగర్, నాగమణి, చిత్తారి ముదిరాజ్, వెంకటేష్, విజయ్, ముత్యం రెడ్డి, కేశవరం యాదగిరిచారి, సందీప్ యాదవ్, పాదం వెంకటేష్, కొండల్ రావు, ఉదయ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రపంచాన్ని వదలని మహమ్మారులు!?

ప్రపంచాన్ని మహమ్మారులు వదలట్లేదు. మొన్న కరోనా, నిన్న ఎబోలా.. నేడు మరోటి. ఇలా ప్రపంచాన్ని ఎదో ఒక వ్యాదితో అతలాకుతలం చేస్తున్నాయి. కరోనాతో ప్రపంచాని అతలాకుతలం చేసింది ప్రతీ ఒక్కరికి తెలిసిందే. ఇప్పటికీ ఆ పీడకలనుంఛి ఇకా కోలుకోలేదు. ఆ తరువాత ఎబోలా వ్యాధి కొన్ని దేశాలపై ముప్పెట దాడి చేసి అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎనలేని దెబ్బకొట్టింది. ఇలాంటి విపత్తునుండి ప్రపంచం బయటపడక ముందే రష్యాలో మరో వింత వ్యాధి అక్కడి ప్రజలను భయపెడుతోంది. తాజాగా సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్? టెక్నీషియన్? తెలియని ఇన్ఫెక్షన్?తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్?లో ఉంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్?ఫెక్షన్?/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది.అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్?ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్?మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. రష్యాలో అత్యంత ప్రమాదకర ప్లేగ్.. అవుట్ బ్రేక్ అయింది. భయానకంగా విస్తరిస్తోంది. ఓ మరణం సైతం సంభవించింది. వందలాదిమంది క్వారంటైన్ లోకి వెళ్లారు కూడా. ఈ సంఘటనతో ఉలిక్కిపడిందా దేశం. తక్షణ నివారణ చర్యలను తీసుకుంటోంది. అటు అమెరికా సైతం దీనిపై ఆరా తీస్తోంది. ప్లేగ్ అవుట్ వ్యాప్తి చెందిన ఉదంతంపై రష్యాతో సంప్రదింపులు జరుతున్నామని, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటోన్నామని వైట్ హౌస్ వెల్లడించింది. సైబీరియాలో గల ఓ రహస్య ప్లేగ్ రీసెర్చ్ ల్యాబ్‌లో అనుకోకుండా చోటుచేసుకున్న ప్రమాదం వల్ల ప్లేగ్ అవుట్ బ్రేక్ అయినట్లు రష్యా చెబుతోంది. ఇర్కుట్స్క్ యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తోన్న సైంటిస్ట్ డారియా షిపిలోవా దీని బారిన పడ్డారు. న్యుమోనియాతో హఠాత్తుగా మరణించారు. ఈ ల్యాబ్ నుంచి అత్యంత ప్రమాదకరమైన లైవ్ బ్యాక్టీరియా బయటకు వచ్చిందనే అనుమానాలతో వందలాది మందిని స్థానిక అధికారులు క్వారంటైన్‌లో ఉంచారు. ప్లేగ్ వ్యాప్తి చెందడానికి కారణం అయ్యే లైవ్ బ్యాక్టీరియా ఉన్న ల్యాబ్ టెస్ట్ ట్యూబ్‌ను ఆ సైంటిస్ట్ ప్రమాదవశాత్తూ పగలగొట్టినట్లు రీసెర్చ్ సెంటర్ ప్రాథమికంగా అంచనా వేసింది. మరణించడానికి కొద్ది గంటల ముందు ఈ విషయాన్ని డారియా స్వయంగా ఆసుపత్రి సిబ్బందికి వివరించినట్లు రష్యా మీడియా తెలిపింది. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె.. టెస్ట్ ట్యూబ్ పగిలిన తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల్లోనే మరణించారు. మంగోలియా సరిహద్దుకు ఆనుకుని ఉండే బురియాటియాలో ఉంటుందీ రీసెర్చ్ సెంటర్. దీంతో అటు మంగోలియా కూడా నివారణ చర్యలను తీసుకుంటోంది. ఆమె మరణం తరువాత రష్యా ప్రభుత్వం వేగంగా స్పందించింది. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను ప్రారంభించింది. డారియాకు ట్రీట్మెంట్ అందించిన ఆసుపత్రిలో దాదాపు 200 మందిని క్వారంటైన్ చేసింది. ఈ రీజియన్ లోని ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసింది. ఈ మరణానికి గల అసలు కారణం న్యుమోనిక్ ప్లేగ్ అని ప్రాథమికంగా నిర్ధారించిందక్కడి ప్రభుత్వం. ఎర్సినియా పెస్టిస్ అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియా వల్ల ప్లేగ్ వ్యాధి సంభవించినట్లు తేల్చింది. మధ్య యుగంలో పలువురి ప్రాణాలను బలిగొన్న బ్లాక్ డెత్ మహమ్మారికి ఈ బ్యాక్టీరియానే కారణం. సాధారణంగా ప్లేగ్‌లో బుబోనిక్, న్యుమోనిక్, సెప్టిసిమిక్ అనే మూడు రూపాలు ఉంటాయి. వీటిలో శ్వాసకోశ వ్యవస్థపై నేరుగా దాడి చేసే న్యుమోనిక్ ప్లేగ్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. జ్వరం, శ్వాస ఆడకపోవడం, దగ్గు వంటి ప్రాథమిక లక్షణాలు ఇందులో కనిపిస్తాయి. అదే ఇప్పుడు రష్యాలో అవుట్ బ్రేక్ అయినట్లు వార్తలొస్తోన్నాయి. ఈ నేపథ్యంలో మాస్కో హెల్త్ నిపుణులు రంగంలోకి దిగారు. శానిటేషన్ వింగ్ చీఫ్ డాక్టర్ అన్నా పోపోవా స్వయంగా ఉన్నతాధికారులతో కలిసి సైబీరియా చేరుకుని ఈ ల్యాబ్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉందని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. సైబీరియాలోని యాంటీ-ప్లేగ్? పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్? తెలియని ఇన్?ఫెక్షన్?తో మరణించారు. ఇర్కుట్స్క్? సమీపంలోని షెలెఖోవ్?లో ఉన్న యాంటీ-ప్లేగ్? రీసెర్చ్? ఇన్?స్టిట్యూట్?లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్? దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమెనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్?ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్? , షెలెఖోవ్? నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్? పేర్కొంది. ఏది ఏమైనపప్పటికీ, ల్యాబ్? ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్?ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్? సంభవించి ఉండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్? ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్? వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్? పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్? గవర్నర్? ఇగోర్ కోబ్జెన్? మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు ఇన్?ఫెక్షన్? ప్రబలిన పరిశోధన కేంద్రానికి సమీపంలో ఉన్న అల్యూమినియం కర్మాగారం తమ సిబ్బందిని ముఖానికి మాస్కులు ధరించాలని ఆదేశించింది. సదరు కర్మాగారం అధిపతి ఆర్టెమ్ ఫోమినిఖ్? మాట్లాడుతూ, ఈ ఇన్?ఫెక్షన్ వ్యాప్తిపై దేశంలో ఊహాగానాలు, రూమర్లు, పరస్పర విరుద్ధంగా ఉన్న నివేదికలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు వాటిని నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాదు మరణించిన ల్యాబ్? టెక్నీషియన్?తో సన్నిహితంగా ఉన్న వారందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచారని, ప్రస్తుతం వారిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించలేదని ఆయన అన్నారు.మరోవైపు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా సమీపంలోని ప్రసూతి కేంద్రంలో ఐసోలేషన్ ప్రోటోకాల్? అమలు చేస్తున్నారు. మరోవైపు రష్యన్ అధికారులు అంతా బాగానే ఉందని చెబుతున్నప్పటికీ, అధికారులు చేపడుతున్న చర్యలు ప్రజల్లో ఆందోళన పెంచుతోంది. కాగా, గతంలో రోస్పోట్రెబ్నాడ్జోర్?కు నాయకత్వం వహించిన ఒనిషెంకో మాట్లాడుతూ, ఇది ప్లేగ్ వ్యాధి కాకపపోవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఇంకా ఇది ఏమిటో నిర్ధరించబడలేదని, కానీ ఆ వ్యాధి వ్యాపించే అవకాశం లేదని అన్నారు.యెర్సినియో పెస్టిస్? అనే బాక్టీరియా వల్ల ప్లేగ్ వ్యాధి సోకుతుంది. ఇందులో ఉండే మూడు రకాల్లో న్యుమోనిక్ ప్లేగ్ ఒకటి. ఈగలు, జంతువులు, సంపర్కం ద్వారా వ్యాపించే ప్లేగ్? కంటే, ఇది చాలా భిన్నంగా ఉంటుంది. న్యుమోనిక్ ప్లేగు శ్వాసకోశ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంటుంది. అంతేకాదు గాలి ద్వారా మానవుల్లో ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. యూఎస్? సెంటర్స్? ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వారి పత్రాల ప్రకారం, న్యుమోనిక్ ప్లేగు సోకిన వారిలో అధిక జ్వరం, తలలో అసౌకర్యం, అలసట వంటి లక్షణాలు ఉంటాయి. ఆ తర్వాత వేగంగా న్యుమోనియా, శాసతీసుకోవడంతో ఇబ్బందులు, ఛాతీలో అసౌకర్యం, దగ్గు, అప్పుడప్పుడు రక్త స్రావం లేదా ద్రవరూపంలో స్రావాలు బయటపడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏది ఏమైనా మరో పెనువిపత్తుగా మారకముందే హెల్త్ నిపుణులు అప్రమత్తమై వ్యాధి వ్యాప్తి చెందకుండా అరికట్టాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

కొత్తగా పెన్షన్లకు 14 లక్షల దరఖాస్తులు

ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్

విజయవాడ : ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్ల మంజూరు అంశం అధికార కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం కొత్త దరఖాస్తులను ఆహ్వానించడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13.65 లక్షల కంటే ఎక్కువ అప్లికేషన్లు వచ్చి పడ్డాయి. నెలకు ప్రాథమిక పింఛను మొత్తాన్నే రూ. 4,000కు పెంచడంతో, ప్రభుత్వ ఖజానాపై ఇప్పటికే ప్రతినెలా రూ. 2,700 కోట్లకు పైగా భారం పడుతోంది. ఈ నేపథ్యంలో దాదాపు 14 లక్షలకు పైగా వచ్చిన కొత్త దరఖాస్తులన్నింటికీ ఆమోదం తెలిపి పింఛన్లు ఇవ్వడం అనేది నిధుల కొరతతో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఏమాత్రం సాధ్యంకాని పని.మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు భారీగా పింఛన్లు ఇచ్చారనే విమర్శలు ఉన్నప్పటికీ, వాటిని తొలగిస్తే రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తుందనే భయం ప్రభుత్వంలో కనిపిస్తోంది. లక్షలాది మంది పాత లబ్ధిదారుల పింఛన్లను ఒకేసారి రద్దు చేస్తే, లబ్ధిదారులు వీధిలోకి రావడం, ప్రతిపక్షాలు దానిని ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవడం ఖాయం. అందువల్ల పాత లబ్ధిదారుల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. ఫలితంగా అనర్హుల పింఛన్లు కొనసాగుతుండటం క్షేత్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.ఈ పరిస్థితి అధికార పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. గతంలో ప్రత్యర్థి పార్టీకి మద్దతుగా ఉన్నవారికి పింఛన్లు అందుతున్నాయి.. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన మాకు, మా సానుభూతిపరులకు కొత్త పింఛన్లు రాకపోతే మేమేం చేయాలి? అని కూటమి కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తమకు దక్కాల్సిన న్యాయం జరగకపోతే, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి సహకరించడం కష్టమని కిందిస్థాయి నాయకులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామం శ్రేణులను ఏకం చేయడంలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలకు పెద్ద సమస్యగా పరిణమించింది. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఆరంచెల తనిఖీ, డిజిటల్ ఫిల్టరేషన్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో దాదాపు 1.42 లక్షల దరఖాస్తులను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయనే కారణంతో పక్కన పెట్టారు. భూమి పరిమితి, విద్యుత్ వాడకం, ఆదాయ పన్ను, నాలుగు చక్రాల వాహనాలు వంటి సాంకేతిక ప్రామాణికాలను కఠినతరం చేసి.. అర్హత లేని వారి దరఖాస్తులను సాంకేతిక కారణాలతో తిరస్కరించడం ద్వారా రాజకీయ కక్ష సాధింపు కాదు, నిబంధనల ప్రకారమే జరిగింది అని చెప్పే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందిఅంతేకాకుండా, ఒకే విడతలో అందరికీ పింఛన్లు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి, దశలవారీగా మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి విడతలో అత్యంత పేదలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి, మిగిలిన వారి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ద్వారా తాత్కాలికంగా ఉపశమనం పొందాలని చూస్తోంది. అలాగే, పాత పింఛన్లలో తీవ్రమైన బోగస్, రీ-వెరిఫికేషన్‌లో తేలిన కొన్ని స్పష్టమైన అనర్హతల ఆధారంగా మాత్రమే తొలగింపులు చేపట్టి, ఆ ఖాళీలలో క్రమంగా కొత్త కార్యకర్తలు లేదా నిజమైన అర్హులను భర్తీ చేసే మార్గాన్ని అనుసరించే అవకాశం ఉంది. కొత్త పింఛన్ల అంశం ప్రభుత్వానికి ఒక వైపు ఆర్థిక భారాన్ని, మరోవైపు స్వపక్ష కార్యకర్తల ఆగ్రహాన్ని తెచ్చిపెట్టింది. సాంకేతిక కారణాలతో ఫిల్టర్ చేయడం వల్ల తాత్కాలికంగా సమర్థించుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన అర్హులు, పార్టీ కార్యకర్తలను సంతృప్తి పరచడం కూటమి నాయకత్వానికి పెద్ద పరీక్షే. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ 'పింఛన్ల చిక్కుముడి'ని ప్రభుత్వం ఎలా విప్పుతుందనేది ఆసక్తికరంగా మారింది.

వ్యూహాలు సరే...ఆచరణ సాధ్యమేనా

గుంటూరు : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన సవాలుగా మారాయి. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తుడిచిపెట్టేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చావో రేవో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లాల వారీగా రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక ఎన్నికలను లైట్ తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అధికార పక్షం నుంచి ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతీ స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి పోటీని రసవత్తరంగా మార్చడమే జగన్ ప్రాథమిక వ్యూహంగా కనిపిస్తోంది.ఈసారి స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ వ్యూహం మునుపటి కంటే చాలా భిన్నంగా ఉంది. ప్రతీ స్థానానికి సంబంధించి ప్రతిపాదించిన అభ్యర్థుల బలాబలాలను జగన్ స్వయంగా వడపోస్తున్నారు. అభ్యర్థి పార్టీకి ఎంత విధేయుడు? కేసులకు భయపడకుండా నిలబడగలడా? గెలిచాక పార్టీ మారకుండా ఉంటాడా? అనే అంశాల ఆధారంగానే బి-ఫామ్‌లు ఖరారు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇన్చార్జిలు సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, అధిష్టానం వద్ద ఉన్న సమాచారంతో జిల్లాల నివేదికలను సరిపోల్చుకుంటున్నారు. ఓడినా గెలిచినా బరిలో నిలవడం ద్వారా మాత్రమే పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చని జగన్ బలంగా నమ్ముతున్నారు.ఇదే సమయంలో, అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలోని అంతర్గత విభేదాలను క్యాష్ చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతుండటంతో ఆశావహుల పోటీ కూటమిలో పీక్స్‌కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ సీటు కోసం టీడీపీలోని బలమైన వర్గాలు, జనసేన నేతల మధ్య టికెట్ల పోరు తీవ్రమవుతోంది. కూటమిలో కిందిస్థాయి నాయకుల మధ్య సమన్వయం కుదరడం అంత తేలిక కాదన్న విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ, అక్కడ ముదిరే విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది.ఈ మైండ్ గేమ్‌లో భాగముగానే వైఎస్సార్‌సీపీ తమ మేయర్, చైర్మన్ అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. కూటమిలో టికెట్ దక్కని అసంతృప్త నేతలు, లేదా భాగస్వామ్య పక్షాల మధ్య కుదరని పొత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను గమనించిన తర్వాతే తమ అభ్యర్థులను ఖరారు చేయాలనేది జగన్ ఆలోచన. అంతేకాకుండా, ముందుగానే తమ అభ్యర్థుల పేర్లు బయటపెడితే అధికార యంత్రాంగం ద్వారా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడతారనే వ్యూహాత్మక భయం కూడా వైఎస్సార్‌సీపీని ముందస్తు ప్రకటనలు చేయకుండా అడ్డుకుంటోంది. సోషల్ మీడియాలోనూ కూటమి వైఫల్యాలను, కిందిస్థాయి నేతల ఘర్షణలను హైలైట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ వింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. పోటీ నుంచి తప్పుకుంటే పార్టీ ఆనవాళ్లు కోల్పోతాం అన్న సంకేతాన్ని జగన్ బలంగా పంపడంతో, క్షేత్రస్థాయి నాయకులు కూడా ఈ ఎన్నికలను తమ ఉనికికి పరీక్షగా భావించి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కూటమి కట్టడిని దాటుకుని స్థానిక సంస్థల్లో సత్తా చాటడం వైఎస్సార్‌సీపీకి అంత సులువైన విషయం కాదు.

ఆందోళన కల్గిస్తున్న యువకుల మరణాలు

ఇటీవల కాలంలో పురుషుల మరణాలు పెద్ద సంఖ్యలో చోటుచేసుకుంటున్నాయని తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. మహిళలతో పోలిస్తే పురుషుల మరణాలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా 15 నుంచి 64 ఏళ్ల మధ్య వయసు గల పనిచేసే, కుటుంబాలను పోషించే వయస్సు ఉన్న పురుషులలో ఈ తేడా అత్యంత తీవ్రంగా ఉందని తెలిపింది. నివేదిక ప్రకారం.. తమిళనాడులో గతేడాది నమోదైన మొత్తం మరణాల్లో 4,01,860 పురుషులు కాగా, 2,91,347 మహిళలు ఉన్నారు. మహిళల కంటే పురుషుల మరణాలు ఏకంగా 1,10,513 ఎక్కువ. గత మూడేళ్లుగా పురుషులు, మహిళల మరణాల మధ్య వ్యత్యాసం లక్షకు పైగానే ఉండటం గమనార్హం. 2023లో 1.10 లక్షలు, 2024లో 1.07 లక్షలు, 2025లో 1.11 లక్షలు.వీరిలో దాదాపు 86 శాతం (94,792 మరణాలు) తమ జీవితంలో అత్యంత కీలకమైన ఉత్పాదక దశలో ఉన్నవారే కావడం మరింత ఆందోళనకరం. ప్రజారోగ్య శాఖ డైరెక్టరేట్ ఓ మెడికల్ జర్నల్‌లో ప్రచురించిన 2018-2022 మధ్య పౌర నమోదు వ్యవస్థ డేటా విశ్లేషణ ప్రకారం.. ప్రతి జిల్లాలో 15 ఏళ్ల వయస్సు దాటినవారిలో మహిళల కంటే పురుషుల మరణాలే ఎక్కువగా ఉన్నాయని తేలింది.నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ టి. సుందరరామన్ మాట్లాడుతూ.. ఈ గణాంకాలు కేవలం జనాభాకు సంబంధించినవి మాత్రమే కాదని అన్నారు. "చాలా చిన్న వయసులో కుటుంబాలు తండ్రులను కోల్పోతున్నాయి. మహిళలు వితంతువులవుతున్నారు. యువత జీవితాలను కాపాడటానికి మనం పెట్టుబడులు పెట్టాలి" అని ఆయన అన్నారు.గతేడాది 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 9,167 మంది, మహిళలు 4,461 మంది ప్రాణాలు కోల్పోయారు. 25 - 34 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 17,135, మహిళలు 6,177.. 35 - 44 ఏళ్ల మధ్య వయస్కుల్లో పురుషులు 31,585, మహిళలు 11,406 మంది, 45 - 54 ఏళ్ల మధ్య మహిళల కంటే పురుషుల మరణాల సంఖ్య 28,474 ఎక్కువ. 55 - 64 ఏళ్లలో మహిళల కంటే 30,475 మరణాలు ఎక్కువ కాగా.. 70 ఏళ్లు దాటిన తర్వాత ఈ వ్యత్యాసం తగ్గింది. పురుషులు 1,55,093 మంది చనిపోతే.. మహిళలు 1,50,545 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రజా ఆరోగ్య నిపుణుల విశ్లేషణ ప్రకారం పురుషుల మరణాలకు యువతలో ప్రమాదాలు, ఆత్మహత్యలు: రోజుకు సగటున 50 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లోనూ, అంతే సంఖ్యలో ఆత్మహత్యల వల్ల మరణిస్తున్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, అలాగే పొగాకు, మద్యం వాడకం వల్ల వచ్చే తీవ్ర అనారోగ్యాలు.మహిళలకు గర్భధారణ, ప్రసవానంతరం ఆరోగ్య పరీక్షలు క్రమంగా జరుగుతాయి. కానీ చాలామంది పురుషులు 40 ఏళ్లు వచ్చే వరకు ఎలాంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం లేదు. తమిళనాడులో నమోదైన మొత్తం 6,93,207 మరణాలలో కేవలం 2,80,856 మరణాలు (41%) మాత్రమే వైద్యపరంగా ధ్రువీకరించనవి. పురుషుల మరణాలలో 42%, మహిళల మరణాలలో 38% మాత్రమే మెడికల్ సర్టిఫికేషన్ పొందాయి.ఆ రాష్ట్రంలో ప్రతి 10 మరణాల్లో 6 ఆసుపత్రుల వెలుపలే జరుగుతున్నాయి. ఆసుపత్రుల బయట జరిగే మరణాలకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి 'వెర్బల్ అటాప్సీ' వంటి విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.స్వీడన్‌లో 2025లో 46,000 మంది పురుషులు, 46,200 మంది మహిళలు మరణించారు. అక్కడ మరణాల సంఖ్య ఇరు వర్గాల్లో దాదాపు సమానంగా ఉన్నప్పటికీ, స్వీడన్‌లో కేవలం 10% మరణాలు మాత్రమే 65 ఏళ్ల వయస్సు కంటే ముందు జరుగుతాయి. అదే మన దేశంలో అయితే 42% మరణాలు 65 ఏళ్ల కన్నా ముందే సంభవిస్తున్నాయి.దీర్ఘకాలిక వ్యాధులు, రోగాలను గుర్తించేందుకు ఇంటి వద్దకే వైద్య సేవలు, నిర్మాణ కార్మికులకు హెల్త్ చెకప్‌లు అందిస్తున్నారు. కూలీ కోల్పోతామనే భయంతో పగటిపూట ఆసుపత్రులకు రాని పురుషుల కోసం సాయంత్రం వేళల్లో క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇక్కడ బీపీ, షుగర్ తనిఖీలు చేస్తున్నారు. ఉపాధి కోసం ద్విచక్రవాహనాలపై ప్రయాణించే పురుషుల భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా చర్యలను తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉంది. పురుషుల అకాల మరణాలను నివారించడం అనేది కేవలం వారి ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది కుటుంబ ఆర్థిక భద్రతకు. మహిళలు, పిల్లల భవిష్యత్తుకు రక్షణ అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

వంశీధరుని కంస విధ్వంసనం

శుకయోగి పరీక్షిత్తుతో రాజా! సరాముడైన శ్యాముడు ధనుశ్శాలకు వెళ్లి వామహస్తంతో ధనుస్సును పైకెత్తి, అల్లెత్రాడు బిగించి, వేదండం- ఏనుగు ఇక్షుదండాన్ని- చెరకు గడను వలె, రెండుగా విరిచాడు. ఆ ధ్వని వీనులకు భయంకరమై కంసుని ధైర్యాన్ని భేదించింది. మీదికి వచ్చిన చాప రక్షకులను రామకృష్ణులిద్దరూ చెరో వింటి తుంట పట్టుకొని కొట్టి మట్టుబెట్టారు. ఇలా మధురా నగరంలో కడు వేడుకతో విహరించి సోదరులు తమ విడుదులకు విచ్చేశారు. ఈ సందర్భంలో అమాత్యుడు చేసిన సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు సహృదయ హృదయాహ్లాదకరంగా, సరసంగా సాగినై. ఇందు- చంద్ర ఉదయానికి ముకుళించు కొన్న ఇందీవరాలను- అరవిందాలను (పద్మాలను) ఎంత హృదయంగమంగా ఉత్ప్రేక్షించి వర్ణించాడో వీక్షించండి. తాను కళాధరుడు (చంద్రుడు)- కళలు ధరించిన వాడగు గాక, కమలాలయ- లక్ష్మికి తోబుట్టువగు గాక, సెగకంటి (శివుని) శిగ (తల) నెక్కి నిక్కుగాక, ఇంతవాడైనా అన్యుడైన చందురుని పొత్తు మాకు ఎంతమాత్రమూ అక్కర లేదు. తపనుడు- తపింప జేసేవాడైనప్పటికీ మా పతి తరణి- సూర్యుడే అని ఉత్తమురాలైన నాతి- పతివ్రత స్త్రీ వలె పద్మినీ జాతి మూతి ముడుచుకొందిట! ఆటవెలది ఐనా పై పద్యంలో 'సతీధర్మం' చాలా తేటగా- ఇల్లాలికి దీటైన బాటగా అప్రతిహతంగా నిరూపితమైంది. పోతన గావించిన ఇలాంటి వర్ణనలే భావి ప్రబంధ కవులకు 'మేలుబంతి' అయ్యాయి. శుకుడు- రాజా! ఆ రాత్రి క్రూరుడైన భోజపతి కంసునికి ఓజ (శోభ, వికాసం) చెడి నిద్ర పట్టలేదు. దారుణమైన దుశ్శకునాలు చూచాడు. మృతికి హేతువైన భీతితో అతని మతి అతిగా కలత చెందింది. మరునాడు మల్లయుద్ధానికి సిద్ధమైన రంగంలో కంసుడు ఎత్తయిన మంచెపై మనసులో ఇంచుకైనా శాంతి లేకుండా కూర్చున్నాడు. నందాదులు కంసుని అనుజ్ఞతో ఉన్నత ఆసనాలను అలంకరించారు. రామకృష్ణులు రంగస్థలం ప్రవేశ ద్వారం వద్ద వేచి ఉన్న, తొండంతో కొండలను కూడా పిండి చేయగల 'కువలయాపీడమ'నే మత్త వేదండాన్ని- ఏనుగును చూచి సమీపించారు. అంత, మావటి మురభంజను- కృష్ణునిపై ఆ కుంజరాన్ని ఢీ కొలిపాడు. కువలయాపీడం- భూ వలయాన్ని- మానవజాతిని మిక్కిలిగా పీడించే మద, మోహ, దర్పాలకు చక్కని ప్రతీకం.



ఆధ్యాత్మికం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలి

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి యువత ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మంగళవారం ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి తో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్ శాఖ చేపట్టిన 'మిషన్ పరివర్తన' కార్యక్రమం ఎంతో మంచి కార్యక్రమమని అభినందించారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై మరింత అవగాహన కల్పించేలా 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావొద్దని సూచించారు. కేవలం సరదా, థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించ కూడదని హితవు పలికారు. డ్రగ్స్‌కు బానిసలైతే విలువైన విద్య, కెరీర్‌తో పాటు భవిష్యత్ కూడా దెబ్బతింటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో కూడా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెడతాయని అన్నారు. ఎవరైనా 'ఒక్కసారి ప్రయత్నించు' అని చెప్పినా వారి మాటలను వినవద్దని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ ప్రభావితులకు తక్షణమే డీ–అడిక్షన్ చికిత్స : ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి ప్రభావానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి తెలిపారు. సమాచారం అందిన వెంటనే వారికి అవసరమైన డీ–అడిక్షన్ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వైపు వెళ్లకుండా యువతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చాను : 2006లో తాను జడ్పీ సభ్యుడిగా ఎన్నికయ్యానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశీస్సులతో మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం లభించిందని అన్నారు. ప్రజల ఆశీస్సులతో లభించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ధన్యవాదాలు తెలిపారు. 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ మరింత విస్తృతంగా నిర్వహించి యువతలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను ప్రతి ఒక్కరికీ వివరించి, వాటి నిర్మూలనకు అవసరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు - డీసీపీ రాంరెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల విక్రయాలు, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. యువత తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను డ్రగ్స్ కారణంగా నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. తమ చిన్ననాటి రోజుల్లో సారా వినియోగాన్ని నిర్మూలించేందుకు 'మార్పు' నాటికను రూపొందించి ప్రజల్లో అవగాహన కల్పించామని డీసీపీ రామ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల నిర్మూలన కోసం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చైతన్య సందేశాన్ని అందిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి , జిల్లా కలెక్టర్ , డీసీపీ పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరుస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, ఏసీపీ కృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, మహిళా సంఘాల సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 06: వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నందున, అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి పట్టభద్రులైన వారు అర్హులుగా, 2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను కొత్తగా తయారు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2027 మార్చిలో శాసనమండలిలో ఏర్పడ నున్న ఖాళీ నేపథ్యంలో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫారం – 18 సమర్పించాలి : వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదుకు అర్హత ఉన్న పట్టభద్రులు ఫారం–18లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు సంబంధిత ఏఈఆర్ఓ/అధికారికి ఫారం–18ను నేరుగా కూడా అందజేయవచ్చని తెలిపారు. అవసరమైన ఆధార పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలని సూచించారు. ఫారం – 18 దరఖాస్తులు సమర్పించేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని కలెక్టర్ స్పష్టం చేశారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అర్హులైన పట్టభద్రులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవంబర్ 20 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి, నవంబర్ 25న ప్రచురిస్తారని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సవరణలకు దరఖాస్తులు స్వీకరిస్తారని, తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాసంస్థలు, బ్యాంకుల్లో ప్రచారం చేయాలి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, సర్వీస్ అసోసియేషన్లు, ఇతర సంస్థల అధికారులు తమ పరిధిలోని అర్హత కలిగిన పట్టభద్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిగ్రీ, పీజీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు సమాచారం పంపించి అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ అన్ని బ్యాంకులకు సమాచారం అందించి అర్హులైన ఉద్యోగులు, పట్టభద్ర ఖాతాదారులకు విషయం తెలియజేయాలని తెలిపారు. తహసీల్దార్లు, ఏఈఆర్ఓలు తమ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రాలు, గ్రామాల్లో టామ్‌టామ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రతిరోజూ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అర్హులైన పట్టభద్రులకు ఫారం–18 ఎలా సమర్పించాలి, చివరి తేదీ నవంబర్ 6 అనే విషయాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. స్థానిక సిబ్బంది ద్వారా కూడా సమాచారాన్ని ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

బాణం గుర్తుకు ఓటేయాలని టిడబ్ల్యూయూ ప్రచారం

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్): టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో కుషాయిగూడ డిపోలో టీఎంయూ బలపరిచిన టిడబ్ల్యూయూ తరఫున మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాణం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ టిడబ్ల్యూయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు డిపో పరిధిలో ప్రచారం చేపట్టారు. డిపో గౌరవ అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి సంఘానికి మద్దతు ఇవ్వాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూయూ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల విలీనం, ఉద్యోగ భద్రత, మాస్టర్ పే స్కేల్ సాధనతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో టిడబ్ల్యూయూ ముందుంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి సంఘాన్ని గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గడ్డం యాదగిరి, పత్తి కుమార్, బాల్ రెడ్డి, బాజీ బాషా తదితరులు పాల్గొన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ఈ నెల 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

నేలకొండపల్లి బాలికల సాంఘిక సంక్షేమ

గురుకులంలో ఎలుకల స్వైర వ్యవహారం

- పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 06: నేలకొండపల్లి బాలికల సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం పదిమంది విద్యార్థినీలను ఎలుకలు కరిచి గాయపరిచాయని నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ పై తక్షణమే చర్య తీసుకోవాలని పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు తిప్పారపు.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి కి నేలకొండపల్లి బాలికల సాంఘిక సంక్షేమం గురుకులం ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థినీలు చదువుకునే వసతి గృహలలో సరియైన శుభ్రత చర్యలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తో డార్మెంటు గదులలో ఎలుకలు, పాములు, కోతులు ప్రవేశించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రిన్సిపాల్ ఎలాంటి పట్టింపు లేకుండా వ్యవహరించడంతో విద్యార్థులకు ప్రాణాంతక పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రిన్సిపాల్ తన ఇష్టానుసారంగా వ్యవహరించిన పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు నామమాత్రంగా చూసి చూడనట్లుగా ఉండడంతో గురుకులాలలో పనిచేసే ప్రిన్సిపాల్స్ విద్యార్థుల యోగక్షేమాలను సైతం మరిచి కాలక్షేపంగా ఉంటున్నారని అన్నారు. అందులో భాగంగానే నేలకొండపల్లి గురుకులంలో విద్యార్థినీలపై ఎలుకలు స్వైర విహారంగా ఉంటూ విద్యార్థినీలను గాయపరిచాయని తక్షణమే ఎలుకలు,కోతులు, పాములను రానీయకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు తో పాటు ఖమ్మం జిల్లా నాయకులు త్రినాథ్, కార్తీక్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 06: పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, చదివే ప్రతి అంశాన్ని అర్థం చేసుకొని జ్ఞానాన్ని పెంచుకోని, స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణతో కూడిన చదువు, నిరంతర సాధనతో ప్రతి విద్యార్థి తన కలలను సాకారం చేసుకోవచ్చు అని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సింగరేణి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యాలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని, ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థుల ఇంగ్లీష్ పాఠ్యపుస్తకంలోని అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించి, పాఠ్యాంశాలను కేవలం పరీక్షల కోసమే కాకుండా ప్రతి పదం, ప్రతి అంశాన్ని అర్థం చేసుకొని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను ఇప్పటి నుంచే నిర్దేశించుకొని, అందుకు అనుగుణంగా చదువుకు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బైపీసీ విద్యార్థులు వైద్య విద్యను లక్ష్యంగా పెట్టుకున్నట్లయితే నీట్ పరీక్షకు ఇప్పటి నుంచే పద్ధతిగా సన్నద్ధం కావాలని తెలిపారు. పరీక్షలో ఎన్ని సబ్జెక్టులు ఉంటాయి, ఏయే అంశాలకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది, ఎన్ని మార్కులు సాధించాల్సి ఉంటుంది వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైద్య విద్యతో పాటు ఫార్మసీ, ఇతర ఆరోగ్య రంగాలకు సంబంధించిన కోర్సులు, కెరీర్ అవకాశాలపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఒక లక్ష్యం సాధ్యం కాకపోతే తదుపరి ప్రత్యామ్నాయ లక్ష్యం ఏమిటనే దానిపై కూడా ముందుగానే స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. మొదట్లో చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడంలో లేదా ఇతరులకు వివరించడంలో కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ, నిరంతర సాధనతో కొన్ని నెలల్లోనే ఆ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఏదైనా అంశం అర్థం కాకపోతే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, అవసరమైతే అందుబాటులో ఉన్న ఇంటర్నెట్, డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే ఇంటర్నెట్‌ను కేవలం వినోదం కోసం కాకుండా విద్యాభ్యాసానికి ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యార్థులు సమూహాలుగా కలిసి చదువుకోవాలని, ఒకరికి తెలిసిన విషయాన్ని మరొకరికి వివరించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులకు ఒక అంశాన్ని బోధించే ప్రయత్నం చేసినప్పుడు ఆ అంశంపై తమకున్న అవగాహన కూడా మరింత బలపడుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్య, వసతి, భోజనం, డిజిటల్ సదుపాయాలు, ఇంటర్నెట్ తదితర అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి ఆలేటి ప్రమీల, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మ, సీడీపీవో కె.ఉమా, మండల విద్యాశాఖ అధికారి జయరాజు, నీటిపారుదల శాఖ డీఈ డి. వెంకట్ నాయక్, ఎంపీవో రాజేంద్రప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సంవత్సరాలు గడుస్తున్న పూర్తికాని రహదారి.

అత్యవసరంలో అంబులెన్స్ సైతం వెళ్లాలంటే నరకమే.

మహేశ్వరం అక్టోబరు 06 (ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి, వత్తుల భాస్కర్), : సంవత్సరాలు గడుస్తున్నా రహదారి పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే మహేశ్వరం మండల పరిధిలోని డబిల్ గూడ గ్రామానికి వెళ్లే రహదారి దాదాపు నాలుగైదు సంవత్సరాలుగా పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబిల్ గూడ గేటు నుండి గ్రామంలోకి అత్యవసర సమయంలో అంబులెన్స్ సైతం వెళ్లడానికి అరగంట టైం పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం తీవ్రంగా లేకపోవడంతో కాస్త నయమని గ్రామస్తులు అంటున్నారు. లేదంటే భారీ వర్షాలు కురిస్తే రహదారిపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024 లో పూర్తి కావాల్సిన రహదారి నేటికీ కూడా పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి డబిల్ గూడ రహదారిని పూర్తిచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం.

డబిల్ గూడ రహదారి కేవలం మూడు వందల మీటర్లు పూర్తి చేసి మిగతాది అలాగే వదిలేసి చేతులు దులుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు రహదారులు నిర్మించడంలో పూర్తిగా విఫలమైంది డబిల్ గూడ రహదారి ఐదు సంవత్సరాలుగా పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో భారీ వర్షాలు లేక బతికి పోతున్నాము. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి డబిల్ గూడ రహదారిని తొందరగా పూర్తి చేయాలి.
బుగ్గని యాదమ్మ యాదయ్య. డబిల్ గూడ గ్రామ సర్పంచ్.

రోడ్డు టెండర్లు పూర్తి దసరా తర్వాత పనులు ప్రారంభిస్తాం

డబిల్ గూడ రహదారి సమస్యపై పంచాయతీరాజ్ శాఖ ను వివరణ కోరగా. డబిల్ గూడ రోడ్డుకు సంబంధించి టెండర్లు పూర్తి చేసి అగ్రిమెంట్ చేయడం జరిగిందని తెలిపారు. రోడ్డు పనులను దసరా పండుగ తర్వాత ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. గుంతలమయంగా మారిన మిగతా రోడ్డు వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు త్వరలోనే పరిష్కారం లభించనుందన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రజా గొంతుక ఆధార్ పార్టీ

- ఆధార్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ సమావేశంలో డా. ఈడా శేషగిరిరావు

భద్రాచలం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 06: తెలంగాణ రాష్ట్ర ప్రజా గొంతుకగా, 2028 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఆధార్ పార్టీ జెండా ఎగరడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా .ఈడా శేషగిరిరావు అన్నారు. మంగళవారం భద్రాచలం లోని గిరిజన అభ్యుదయ భవనంలో కల్లూరి రాణి అధ్యక్షతన జరిగిన ఆధార్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీటికి సరైన ప్రత్యామ్నాయం ఆధార్ పార్టీయేనని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటం ద్వారా ప్రజల లో విశ్వాసం పెరుగుతుందని శేషగిరిరావు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కేటాయించే బడ్జెట్ నిధులు పూర్తిస్థాయిలో ఆయా వర్గాల సంక్షేమానికే వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తల పై వున్నది అని అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉప అధ్యక్షులు ఆంబోజి బుడ్డయ్య, ఎస్ టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆలేం వెంకటేశ్వర్లు, ఎస్ సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు బండ రాజారావు, రాష్ట్ర ఆర్గనైజేర్ సెక్రటరీ తోడేటి దుర్గ ప్రసాద్, రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్ గుణగంటి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కంటే కేశ్వవ గౌడ్, పూనె ముత్యం దొర, జిల్లా సువాసిని, అశ్వారావుపేట నియోజకవర్గం ఇంచార్జి కార్షిమా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు గాలికొదిలి ఫ్యూచర్ సిటీతో రియల్ ఎస్టేట్ వ్యాపారం

మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి.

రూ.3 కోట్ల 18 లక్షల 50 వేలతో అభివృద్ధి పనులకు శ్రీకారం.

మహేశ్వరం అక్టోబరు 06 (ది క్రైమ్ న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజల సమస్యలు గాలికి వదిలేసి ఫీచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా విమర్శించారు. తుక్కుగూడ మంఖాల్ డివిజన్ పరిధిలో మొత్తం రూ.3 కోట్ల 18 లక్షల 50 వేల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. రావిర్యాల పాత బ్రిడ్జి నుంచి సర్దార్‌నగర్ గ్రామం వరకు చేపట్టనున్న డ్రైనేజీ పనులు, సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం కమాన్ నుంచి రావిర్యాల వరకు చేపట్టనున్న బీటీ రోడ్డు, సీసీ రోడ్డు విస్తరణ పనులు, అలాగే ఓఆర్ఓర్ సర్వీస్ రోడ్డు నుంచి జన్నాయిగూడ వరకు చేపట్టనున్న రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారని, సరైన రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పనులతో భక్తులు, స్థానిక ప్రజల సమస్యలకు పరిష్కారం లభించనుందని అన్నారు. అనంతరం శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానాన్ని సందర్శించిన సబితా ఇంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మున్సిపల్ ఫండ్ ద్వారా పలు రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరయ్యాయని, అయితే ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి పనులను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ద్వారా నిలిచిపోయిన పనులకు మళ్లీ నిధులు మంజూరు చేయడం జరుగుతోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. మంజూరైన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా కరెంటు కోసం ఎదురుచూపులు

- మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్ ప్లాట్ల యజమానుల నిరసన

- కమిషనర్ కార్యాలయంలో ప్లకార్డులతో ఆందోళన..

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మేడ్చల్ , అక్టోబర్ 6: నాలుగేళ్లు కావస్తున్నా మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించకపోవడంపై ప్లాట్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్‌లో ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కమిషనర్ కార్యాలయం వద్ద కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాట్ల యజమానులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ బ్యానర్లు, ప్లకార్డులు చేతబట్టి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని నినాదాలు చేశారు. మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్ అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. లేఅవుట్‌లో పెండింగ్‌లో ఉన్న ఇతర మౌలిక వసతుల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హెచ్ఎండీఏ సీఈ పరంజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి హెచ్ఎండీఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత హెచ్ఎండీఏపై ఉందన్నారు. వెంటనే విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు సీపీఆర్ఐ--పర్వతాపూర్ 60 అడుగుల అప్రోచ్ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. లేఅవుట్‌లోని పార్కు స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించి గేట్లు ఏర్పాటు చేయాలని, పార్కుల్లో పచ్చదనం పెంపొందించాలని డిమాండ్ చేశారు. నత్తనడకన సాగుతున్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపుల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని కోరారు. లేఅవుట్‌లో నివసించే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ఇకపై జాప్యం చేయవద్దని హెచ్ఎండీఏ అధికారులను డిమాండ్ చేశారు. ఆందోళనలో అసోసియేషన్ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, మహేష్, డీఎస్ నాయక్, అశోక్‌రెడ్డి, కొండగళ్ల అశోక్, బొడిగె ప్రభాకర్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, పరమేశ్‌గౌడ్, నెహ్రూ, సాగర్‌రెడ్డి, జయప్రకాష్, వరలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

భార్యామణి లఘు చిత్రం షూటింగ్ ప్రారంభం.

రామగిరి అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్):-రామగిరి మండలం లోక కేసారం శివారులో గల మాజీ సర్పంచ్ మంజూర్ ఫామ్ హౌస్ లో భార్యామణి లఘు చిత్రం షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. కుటుంబ కథా చిత్రంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ చిన్న చిత్రాల దర్శకుడు నిర్మాత తెలంగాణ లైఫ్ సినిమా ఛానల్ అధినేత రాపల్లి కుమార్ పటేల్ నేతృత్వంలో రూపుదిద్దుకుంటుంది. నిర్మాతగా గోలి తిరుపతి పటేల్ వ్యవహరిస్తున్నారు. ముహూర్తం షార్ట్ ను సీనియర్ జర్నలిస్టు రేఖ రెడ్డి పై చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని ద్వారా ఆదరించాలని తెలంగాణ చిన్న సినిమాల ఛానల్ ద్వారా త్వరలో విడుదల కాబోతుందని. దీనికి గాను తారాగణం గోలీ తిరుపతి పటేల్ ,రేఖా రెడ్డి, స్వరూప, రోజా, పద్మ, విజయ పటేల్, సంపత్ కుమార్, నక్క శ్రీనివాస్, కెమెరామెన్ నాయిని బాలు ఎడిటింగ్ ఆకన భాస్కర్, ప్రముఖ కొరియోగ్రాఫర్ పులిపాక దేవా, మానస తదితరులు పాల్గొన్నారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం.. పెంట్‌హౌస్ కూల్చివేత

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్): అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన అదనపు నిర్మాణాలపై కాప్రా సర్కిల్ అధికారులు చర్యలు చేపట్టారు. కాప్రా సర్కిల్ పరిధిలోని అసిస్టెంట్ సిటీ ప్లానర్ కల్యాణ రాణి ఆదేశాల మేరకు టీపీఎస్ తుల్జాసింగ్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం నకూల్చివేత చర్యలు నిర్వహించారు. మీనాక్షి నగర్, నాగార్జున నగర్ కాలనీలోని ఓ భవనంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన పెంట్‌హౌస్ భాగంతో పాటు స్టిల్ట్‌లో ఏర్పాటు చేసిన అదనపు గదులను అధికారులు తొలగించారు. సౌత్ కమలా నగర్‌కు చెందిన బి.భారతమ్మకు సంబంధించిన సదరు భవనానికి స్టిల్ట్‌తో పాటు మూడు పై అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే మంజూరైన అనుమతులకు విరుద్ధంగా నాలుగో అంతస్తులో కొంత భాగాన్ని అదనంగా నిర్మించడంతో పాటు స్టిల్ట్ ప్రాంతంలో గదులను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. భవన నిర్మాణ అనుమతులను పరిశీలించిన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలకు అధికారులు ఉపక్రమించారు. కాప్రా సర్కిల్-7 పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో అనధికారిక నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రంగంలోకి దిగారు. యంత్రాల సహాయంతో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన నాలుగో అంతస్తు పెంట్‌హౌస్ భాగాన్ని, స్టిల్ట్‌లో నిర్మించిన అదనపు గదులను కూల్చివేశారు. నిర్మాణదారులు మంజూరైన అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని, అదనంగా చేపట్టే నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి అనధికారికంగా నిర్మాణాలు చేపడితే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

మాతా-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లాలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు 2026 వరకు శాఖ సాధించిన ప్రగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల గుర్తింపు పరీక్షల్లో 88 శాతం ప్రగతితో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం అభినందనీయమన్నారు. రక్తపోటు నియంత్రణలో 54 శాతం, మధుమేహ నియంత్రణలో 58 శాతం ప్రగతి నమోదైనట్లు తెలిపారు. ఈ-సంజీవని ద్వారా ఆగస్టు నెలలో 36,916 టెలి వైద్య సంప్రదింపులు నిర్వహించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. జిల్లాలో సి-సెక్షన్ ప్రసవాల శాతం 67.5 శాతంగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 52.7 శాతం, ప్రైవేటు ఆసుపత్రుల్లో 87 శాతం సి-సెక్షన్లు జరుగుతున్నందున అనవసర శస్త్రచికిత్సలను నివారించేందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో తప్పనిసరిగా సి-సెక్షన్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రాథమిక సి-సెక్షన్ కేసుల్లో ప్రతి కేసుకు పార్టోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేసి, అవసరమైన సందర్భాల్లో రెండో వైద్య అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లాలో గుర్తించిన 4,213 మంది అధిక ప్రమాద గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ, అనుసరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దకొడప్గల్, బాన్సువాడ, కామారెడ్డి ప్రాంతాల్లో వెనుకబడిన ఆరోగ్య సూచికల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉద్దేశించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇంకా టీకా పొందని 5,451 మంది బాలికలకు పాఠశాలల వారీగా కార్యాచరణ రూపొందించి టీకాలు అందించాలని సూచించారు. డెంగ్యూ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణకు పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుని విస్తృతంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.వైద్య సేవలకు సంబంధించి ఏవైనా అవసరాలు, సమస్యలు లేదా అదనపు సమాచారం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట్, కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, బాన్సువాడ సూపరింటెండెంట్ శ్రీనివాస్, బీడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, వైద్యులు, అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులో ప్రతి నెల లక్షల రూపాయల స్కాం

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు చెల్లించే వేతనాలు అవకతవకలపై బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ లు బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరీ శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణములో నూతన పాలక వర్గం ఏర్పాటు అయిన నాటి నుండి అభివృద్ధి మాట తరువాత కనీసం వార్డుల్లో పారిశుధ్య సమస్య తీర్చాలని గత 8నెలలుగా అన్ని పార్టీల కౌన్సిలర్ లు సర్వ సభ్య సమావేశాలలో విన్నవించుకున్న ఎలాంటి పురోగతి లేదని గత వారం ఉదయం హాజరు సమయంలో బీజేపీ కౌన్సిలర్ల బృందం ఉదయం వెళ్లగా అక్కడ పని చేసే సిబ్బందికి, హాజరు పట్టికలో వేసిన హాజరుకి సంబంధం లేదని , జీతాల చెల్లింపులో కూడా అవకతవకలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించే 35 గ్రూపులకు చెల్లించిన వేతనాల విషయంలో అనుమానంతో నేడు ఉదయం కార్మికులను వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని. మున్సిపల్ నుండి గ్రూపులకు చెల్లించిన వేతనానికి కార్మికులకు చెల్లించిన వేతనానికి చాలా తేడా ఉన్నదని అన్నారు. వేతనాలు చెల్లించే గ్రూపులో లేని వారికి చెక్ పవర్ ఉండటం, చెక్ పవర్ ఉన్న వారు చేతి వాటం చూపడం, వేతనాలు చెల్లించేటప్పుడు కోతలు విధించడం అనేక అనుమానాలకు తావిస్తుందని అన్నారు. పూర్తి స్థాయి శానిటేషన్ ఇన్స్పెక్టర్ లేకపోవడం వల్ల ఇంచార్జీల కారణంగా డబ్బులు అవకతవకలు జరుగుతున్నాయని, వాటర్ వర్క్స్ విభాగం, ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది విత్తనాల విషయంలో కూడా అనేక అనుమానాలు ఉన్నాయని అన్నింటి విషయంలో విచారణ చేపట్టాలని కలెక్టర్, ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేస్తామని అన్నారు నిజాలు నిగ్గు తేలాల్సిన అవసరం ఉందని ప్రతి నెల లక్షల రూపాయలు దారి మళ్లుతున్నాయని, ప్రజా ధనం దుర్వినియోగం అయితే బీజేపీ చూస్తూ ఊరుకోదని అన్నారు.

భానూరు గ్రామ అభివృద్ధికి బిడిఎల్ పరిశ్రమ యాజమాన్యం సహకరించాలి

పరిశ్రమ యాజమాన్యాన్ని కోరిన పటాన్ చేరు ఎమ్మెల్యే జీఎంఆర్

సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్)పటాన్ చేరు : భానూరు గ్రామ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించి, గ్రామ ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు బిడిఎల్ పరిశ్రమ యాజమాన్యం సహకరించాలని పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం భానూరు గ్రామ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి బిడిఎల్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్‌ను ఎమ్మెల్యే జిఎంఆర్ కలిశారు. ఈ సందర్భంగా భానూరు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా కంచర్లగూడెం ప్రాథమిక పాఠశాలకు నూతన భవన నిర్మాణం, స్మశాన వాటిక అభివృద్ధి, భానూరు,కంచర్లగూడెం బీటీ రోడ్డు మరమ్మతులు తదితర అత్యవసర అభివృద్ధి పనులకు బిడిఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరవై ఐదు ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలి. అదేవిధంగా భానూరు గ్రామానికి చెందిన పలువురు కార్మికులు గత ఇరవై ఐదు సంవత్సరాలుగా బిడిఎల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారిని తొలగించి వారి స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటూ, సుదీర్ఘకాలంగా సంస్థకు సేవలందిస్తున్న కార్మికుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. భానూరు గ్రామం బిడిఎల్ పరిశ్రమకు సమీపంలో ఉన్నందున సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. విద్య, రహదారులు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని సూచించారు. త్వరలో సీఎస్ఆర్ నిధుల కేటాయింపు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి బిడిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. భానూరు గ్రామ అభివృద్ధికి బిడిఎల్ తరఫున ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని, త్వరలోనే సీఎస్ఆర్ నిధులను కేటాయించి అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈడీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సామాజిక బాధ్యత కూడా కీలకమని, భానూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరి సహకారంతో సమగ్రంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ప్రవళిక నరేందర్, రవీందర్ రెడ్డి, నితీష మాణిక్యం, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, పాండు, ముత్తిరెడ్డి, తిరుపతి, శివయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సౌకర్యమే అభివృద్ధికి తొలి ప్రాధాన్యం

-ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట

-ఉద్యోగులకు మెరుగైన సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యం

-నూతన తాగునీటి పైపు లైన్ పనులకు ఆర్జీ-త్రీ జి.యం భూమిపూజ

రామగిరి, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్):- ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట వేస్తుందని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.సెంటినరీ కాలనీ వాసుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సుమారు 07 కోట్ల తో, పోతన కాలనీ ఫిల్టర్ బెడ్ నుండి సెంటినరీ కాలనీ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 8.2 కిలోమీటర్ల నూతన తాగునీటి పైపు లైన్ పనులకు మంగళవారం స్థానిక సోలార్ మెయిన్ కంట్రోల్ కార్యాలయ సమీపంలో రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పైప్ లైన్ వేసి చాలా కాలమైనందున తరచూ మరమ్మత్తులు రావడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, అందుచేత నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు.కాలనీలో తాగునీటి సరఫరాను మరింత మెరుగు పరిచేందుకు నూతన పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమం తో పాటు వారి కుటుంబాల సౌకర్యాలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్వోటుజియం యం. రామ్మోహన్, సివిల్ డిజియం ఎస్.రవి కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు మనోజ్ కుమార్, డి.శ్రీనివాస్, కాంట్రాక్టర్ మాధవరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్స్‌పై నిఘా.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు

క్వాకరీ, అనధికార వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశం

మేడ్చల్, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్): జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్, తనిఖీలు, నిబంధనల అమలుపై జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో క్లినిక్స్, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఇతర వైద్య సంస్థల నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియతోపాటు ఫైర్ సేఫ్టీ అనుమతులు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ఇతర చట్టబద్ధ అనుమతులు, రికార్డుల నిర్వహణపై చర్చించారు. తనిఖీల సందర్భంగా అధికారులు పూర్తి వివరాలతో, సంబంధిత ఆధారాలను జతచేసి సమగ్ర ఇన్‌స్పెక్షన్ రిపోర్టులు రూపొందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. తనిఖీ నిర్వహించిన అధికారుల వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలన్నారు. అవసరమైన సందర్భాల్లో రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రకటించే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లలో వాస్తవంగా అన్ని సమయాల్లో సేవలు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్న క్లినిక్స్, ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఇతర వైద్య సంస్థలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా చలామణి అవుతూ వైద్య సేవలు అందించడం, అనధికారికంగా వైద్యం చేయడం, క్వాకరీకి పాల్పడటం, తప్పుడు వైద్య హామీలు ఇవ్వడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వహించడం, అవసరమైన అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించడం, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించడం గుర్తించిన వెంటనే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని స్పష్టం చేశారు. మందుల విక్రయం, ప్రిస్క్రిప్షన్ అవసరమయ్యే మందుల విషయంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, మందుల విక్రయాలు, వినియోగానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అమలులో ఉన్న ఔషధ చట్టాలు, ప్రభుత్వ నిబంధనలను ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ తప్పనిసరిగా పాటించాలన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు, అందిస్తున్న వైద్య సేవలు, తప్పనిసరి డిస్‌ప్లే బోర్డులను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు వైద్య హామీలు, అనుమతించని వైద్య సేవల ప్రచారంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖవివిధ ప్రభుత్వ శాఖలు, ముఖ్యంగా పోలీస్ శాఖ ద్వారా అందుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సమీక్షించి నిబంధనల ఉల్లంఘనలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అథారిటీ సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం 112 ఎమర్జెన్సీ నంబర్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, క్లినికల్, బయోమెడికల్ వ్యర్థాల బాధ్యతాయుత నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలు, జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేసి, చేపట్టిన చర్యలకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేసి తదుపరి జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశాల్లో సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ మెంబర్ కన్వీనర్ డా. కె. ఆనంద్, ఎస్. కృష్ణ ప్రసాద్, ఏసీపీ, నరసింహారెడ్డి, ఎస్‌హెచ్‌ఓ, డా. బి. వెంకటేశ్వరరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి వసంత డెమో తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ నిమర్జన ఘాట్ పనులను పరిశీలించిన ఆర్.జి త్రీ జీఎం

రామగిరి, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్):- బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక సోలార్ కంట్రోల్ కార్యాలయం వద్ద గల బొక్కల వాగు వద్ద ఏర్పాటు చేస్తున్న, బతుకమ్మ నిమర్జన ఘాట్ పనులను ఆయన పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే మహిళలు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఘాట్ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, డి జి ఎం ఎస్.రవి కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9వ పోషణ్ మాసం కార్యక్రమంలో పాల్గొన్న చైర్పసన్ నాగలక్ష్మి.

ధర్మపురి, అక్టోబర్ 6, (ది క్రైమ్ న్యూస్): మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ పోషణ్ మాసం కార్యక్రమం ధర్మపురి ప్రాజెక్టులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మపురి పట్టణ ప్రథమ పౌరురాలైన మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరై పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. కుటుంబంలో ఒక విద్యావేత్త, ఆరోగ్యవంతమైన తల్లి ఉంటే కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా జగిత్యాల డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆడెపు భాస్కర్ పోషణ మాసం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ధర్మపురి ప్రాజెక్ట్ సిడిపిఓ వాణి శ్రీ ప్రతి కుటుంబం సమతుల్య ఆహారం తీసుకుంటూ పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించాలని తెలిపారు. ధర్మపురి ప్రాజెక్ట్ ఏసి డి పి ఓ మౌనిక గర్భిణీ మరియు బాలింత సమతుల్యా ఆహారం తీసుకుంటూ పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి వార్డు కౌన్సిలర్లు సంగి ఆనంద్, ఒజ్జల లక్ష్మణ్, చీపిరి చెట్టి రాజేష్, ముదుసుల ప్రశాంత్, వివిధ సెక్టార్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రెండు లక్షల ఎల్ఓసీ అందజేత

-అనారోగ్యంతో బాధపడుతున్న కుంటాల వెంకటయ్యకి మంత్రి శ్రీధర్ బాబు భరోసా

-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో కుంటాల వెంకటయ్య కి వైద్య సహాయం

-రెండు లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

రామగిరి, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్):- మంథని నియోజకవర్గం మంథని మండలంలోని ఖాన్సాయి పేట గ్రామానికి చెందిన కుంటాల వెంకటయ్య కి తెలంగాణ రాష్ట్ర ఐటి ఉపరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.,రెండు లక్షల ఎల్ఓసీ మంజూరు చేసి ఇప్పించారు. మంథని మండలంలోని ఖాన్సాయి పేట గ్రామానికి చెందిన కుంటాల వెంకటయ్య నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి రెండు లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది.చికిత్స కోసం రెండు లక్షల ఎల్ఓసీ మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకి కుంటాల వెంకటయ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలి

- డైరెక్టర్ ఆపరేషన్స్ టి.మధుసూదన్

రామగిరి,అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్) : వ్యవసాయ సీజన్‌లో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ఫీడర్లపై లోడ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ టి.మధుసూదన్ ఆదేశించారు.మంగళవారం మంథని డివిజన్ పరిధిలోని కమన్‌పూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను డైరెక్టర్ ఆపరేషన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో నమోదవుతున్న గరిష్ఠ లోడ్లు, అన్ని 33 కేవీ ఫీడర్ల లోడ్లు, 132 కేవీ సర్క్యూట్ స్థాయి లోడ్లను పరిశీలించి అధికారులతో సమీక్షించారు.అధిక లోడ్లు నమోదవుతున్న ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ముందుగానే గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని సూచించారు. లోడ్ బ్యాలెన్సింగ్, ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా మార్గాల ఏర్పాటు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.సబ్‌స్టేషన్‌లోని పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సాంకేతిక లోపాలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని, రైతులకు నాణ్యమైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందేలా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ ఆపరేషన్స్ సూచించారు. అలాగే విద్యుత్కు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చూసుకునే బాధ్యత ప్రతి సిబ్బందిపై ఉండాలని అన్నారు. రాత్రివేళ విద్యుత్ సమస్య వస్తే వెంటనే దాన్ని చూసే బాధ్యత ప్రతి ఉద్యోగి పై ఉందని అన్నారు.ఈ పరిశీలనలో పెద్దపల్లి ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ వి గంగాధర్, మంథని డివిజన్ ఆపరేషన్స్ డి ఈ వి ప్రభాకర్ ఆ సత్యనారాయణ డివైడెం రామగుండం శ్రీనివాస్ ట్రాన్స్కో కరీంనగర్ తదితరులు ఉన్నారు.

హాలియాలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి

నల్గొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । అక్టోబర్ 6 । నాగార్జునసాగర్ హాలియా: హాలియా పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహా గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, నియోజకవర్గ పరిధిలో అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకతతో సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, , అభిమానులు, సోషల్ మీడియా ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యువజన నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ ఉపసర్పంచులు, గ్రామ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వైస్ చైర్మన్లు, చైర్మన్లు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమక్షంలో ఉత్సాహభరితంగా సాగింది.

బీఆర్ఎస్ దగా.. కాంగ్రెస్ అండ

- 283 సింగరేణి భూనిర్వాసితుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు
- మంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే లద్నాపూర్ నిర్వాసితులకు న్యాయం
- మదన పోశమ్మ సాక్షిగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

-మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్

రామగిరి, అక్టోబర్ 06(ది క్రైమ్ న్యూస్):- సింగరేణి బొగ్గు గనుల కోసం తమ భూములు, ఇళ్లను త్యాగం చేసిన రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ నిర్వాసితుల దశాబ్దాల కల ఎట్టకేలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామానికి చెందిన 283 కుటుంబాలకు పునరావాస పరిహారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరైంది. మంత్రి కృషికి కృతజ్ఞతగా లద్నాపూర్ లోని శ్రీ గోదారంగనాయక స్వామి దేవాలయం వద్ద ఆయన చిత్రపటానికి గ్రామస్తులు,కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం చేశారు. గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు అధ్యక్షతన,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు తొగరి చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై పాలాభిషేకంలో పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సింగరేణికి సర్వం ధారపోసినా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదని గత ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "1986-88 ప్రాంతంలో సింగరేణి సంస్థ కోసం లద్నాపూర్ గ్రామస్తులు తమ భూములు, ఇళ్లను దారాదత్తం చేశారు. ఆనాడు ఎకరాకు కేవలం 9,000 నుంచి 10,000 రూపాయల చొప్పున నామమాత్రపు పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. "సమస్య పరిష్కారం కోసం వనం రామచంద్రరావు, తోగరి లింగయ్య, తాటి శ్రీనివాస్ తదితర నాయకులు పలుమార్లు నన్ను కలిశారు. మదన పోశమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు బోనాల జాతరతో నిరసన తెలిపిన సమయంలో.. మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా వారితో స్పీకర్ ఫోన్లో మాట్లాడి తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అనే పదం వస్తే చట్టపరమైన ఇబ్బందులు వచ్చేలా కుట్రలు చేసింది. దీనిని గమనించిన శ్రీధర్ బాబు , న్యాయ నిపుణులతో చర్చించి వ్యూహాత్మకంగా ఆ పదాన్ని మార్చి, 'ఎక్స్‌గ్రేషియా' రూపంలో ప్రత్యేక ఆర్థిక సాయంగా మంజూరు చేయించి 283 కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు" అని ఆయన వివరించారు. ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి న్యాయస్థానంలో కేసులు విత్ డ్రా చేసుకుంటే ఒక్క రూపాయి కూడా రాదని కొన్ని ఇతర పార్టీల నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూశారని ఆయన మండిపడ్డారు. అయినా కూడా గ్రామస్తులంతా ఏకతాటిపై నిలబడి కాంగ్రెస్ పార్టీని నమ్మారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు కూడా గ్రామంలో కల్లిబల్లి మాటలు చెప్పి పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదని విపక్షాలను హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా శ్రీధర్ బాబు నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రొద్ద బాపన్న పటేల్, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ రాజ సెల్ అధ్యక్షులు కండె పోషం,రామగిరి మండలం బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం,మాజీ సర్పంచ్‌లు తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలు,లద్నాపూర్ ఉపసర్పంచ్ అద్దురి శ్రీకాంత్, మాజీ ఉపసర్పంచ్ తొగరి లింగయ్య, తొట్ల మధుయ్య,తాటి ఉదయ్ కుమార్ ,వేముల కనుకయ్య,మాజీ ఎంపీటీసీ వీరగోని లక్ష్మణ్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు గొర్రె నరేష్ యాదవ్, మట్ట రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బర్ల శ్రీకాంత్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు వేముల సత్యం,సదానందం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమీల్,వేముల సత్యం, దుబాసి రంగయ్య ,పొన్నం సత్యం నారాయణ, తాటి శ్రీనివాస్, గండి పైడయ్య, మేడగొని రామ్ చందర్, లక్కెపురం శ్రీనివాస్ తొట్ల ప్రసాద్,గిరివేనా ప్రవీణ్ కుమార్ యాదవ్,పులి సాయి, ఆర్‌డఆర్ ప్యాకేజీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలి.

మురళి నగర్ గ్రామ సర్పంచ్ నేహ భాస్కర్ నాయక్.

మహేశ్వరం అక్టోబరు 06, ది (ది క్రైమ్ న్యూస్) : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మురళి నగర్ గ్రామ సర్పంచ్ నేహ భాస్కర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు మండల పరిధిలోని మురళి నగర్ గ్రామంలో ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆ గ్రామ సర్పంచ్ నేహ భాస్కర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి గ్రామంలో మంచి స్పందన లభించిందని తెలిపారు. గ్రామంలోని ప్రజలు దాదాపు వంద మంది వరకు సాధారణ వ్యాధులతో పాటు బీపీ షుగర్ వంటి పలు రకాల టెస్టులను నిర్వహించి అవసరమై మందులు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో ప్రజలకు ఉపయోగపడేలా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రైమ్ కేర్ హాస్పిటల్ యాజమాన్యానికి వారు అభినందనలు తెలియజేశారు.

ఏటీఎంలో భారీ చోరీ

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఏటీఎం చోరీ కలకలం రేపింది. సాతం రాయ్‌లోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంను టార్గెట్ చేసిన దుండగులు గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కోసి సుమారు రూ.20 లక్షల నగదును దోచుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. తెల్లవారుజామున పక్కా స్కెచ్‌తో రంగంలోకి దిగిన దొంగలు.. ఏటీఎంలోని సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి, వైర్లను కట్ చేసి ఆధారాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు.ఏటీఎం వద్ద నైట్ వాచ్‌మన్ లేకపోవడం దొంగలకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. ఘటన వెలుగులోకి రావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు.

ఆ అందానికి ఎవరైనా ఫిదా అవ్వాలిందే..!

యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కవే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టాఆర్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కీ అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీలీల స్కైబ్లూ కలర్ చీరలో కనిపించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ శారీలో ఈ ముద్దుగుమ్మ అందాలను చూస్తే ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో ఆకట్టుకుంది కిసక్కీ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్ నీలిరంగు చీరలో చందమామలా చాలా అందంగా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

ఇలియానాకి వెరైటీ ప్రశ్నలు.. ఓపికగా స్పందించిన ఇల్లీ బేబి

గోవా బ్యూటీ ఇలియానా ఒకప్పుడు ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆమెని చూస్తే యూత్‌కి పిచ్చెక్కిపోయేది. కెరీర్ సజావుగా సాగుతున్న సమయంలో ఆమె తీసుకున్న తప్పుడు నిర్ణయాలు ఇలియానాని ఇబ్బందుల్లోకి నెట్టాయి. దేవదాసు సినిమాతో ఇలియానా తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగులో ఎన్నో చిత్రాల్లో నటించి మెప్పించింది. అయితే గతేడాది 2023లో ఇలియానా మైఖేల్ డోలన్‌ను వివాహం చేసుకున్నారు. అదే సంవత్సరం ఏప్రిల్‌లో తన తొలి గర్భాన్ని ప్రకటించారు. ఆగస్టులో కుమారుడు కోవా ఫోనిక్స్ డోలన్ కి జన్మనివ్వగా ప్రస్తుతం ఇలియానా తన రెండో బిడ్డ కోసం ఆనందంగా ఎదురు చూస్తున్నారు. ఇలియానా ప్రస్తుతం మాతృత్వపు క్షణాల్ని ఆస్వాదిస్తున్నారు.. అందుకే సినిమాల్ని చేయలేదు. ఇప్పుడు తన ఫోకస్ అంతా కూడా బిడ్డపైనే ఉందని చెప్పుకొచ్చారు. నాకు డైపర్లు మార్చే టైం కూడా ఉండటం లేదు.. నా బిడ్డతోనే బిజీగా ఉంటున్నాను అని ఫన్నీగా ఇలియానా సమాధానం ఇచ్చారు. ఇక ఇలియానాని ఓ నెటిజన్ ఫస్ట్ టైం గర్భం దాల్చాను.. ఏమైనా టిప్స్ ఉంటే చెప్పమని కోరగా, తన అనుభవాన్ని చెప్పుకొచ్చింది. ఎక్కువగా ఆలోచించొద్దు, స్ట్రెస్ తీసుకోవద్దు. ఇప్పుడు రెస్ట్ తీసుకునే సమయం. ఈ ఫేజ్ ఇలా ఉంటుందని అస్సలు అనుకోలేదు.. నేను ఊహించిన దానికి పూర్తి భిన్నంగా ఉంది.. ప్రతీ రోజూ 24 గంటలు రెస్ట్ అన్నదే ఉండటం లేదు. అయితే ఎంత కష్టం అనిపించిన కూడా నా బిడ్డ నవ్వు, ఆ స్పర్శతో అన్నీ కూడా మాయం అవుతున్నాయి. మాతృత్వం అనేది గొప్ప ఫీలింగ్ అని పేర్కొంది. సినిమాలు ఎందుకు చేయడం లేదు అని ఇంకొకరు అడిగే.. బిడ్డ ఫోటోను షేర్ చేశారు ఇలియానా. ఇక పెళ్లి గురించి ఓ నెటిజన్ అడిగాడు. మీకు పెళ్లి అయిందా? లేదంటే కేవలం బిడ్డను మాత్రమే కన్నారా? అని అడగడంతో కాస్త వెరైటీ సమాధానం ఇచ్చింది. ఆలోచిస్తున్నట్టుగా, ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న అని పేర్కొంది. మొత్తానికి నెటిజన్స్ తో సరదాగా ముచ్చటించింది ఇలియానా.

ఆడితే వెరీగుడ్.. ఆడకపోతే బ్యాడ్‌లక్!

అందం, మానసిక పరిపూర్ణత అలంకారాలుగా చేసుకున్న నటి రష్మిక మందన్నా. బాలీవుడ్‌లో ఆమె నటించిన, యానిమల్, చావా చిత్రాలు భారీ విజయాలను నమోదు చేయగా, సల్మాన్‌ఖాన్‌తో ఆమె నటించిన 'సికిందర్' సినిమా మాత్రం చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఈ విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె స్పందించింది. 'జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ రోజు ఉన్నట్టు రేపు ఉండదు. అదే జీవితం. మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా కుటుంబ సభ్యుల నుంచి, స్నేహితుల నుంచి మద్దతు లభిస్తున్నదీ అంటే.. ఇక మనకు మించిన అదృష్టవంతులు వేరొకరు లేరని అర్థం. నేను చేసే ఏ సినిమా విషయంలోనూ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకోను. అది బాగా ఆడితే వెరీగుడ్. ఆడపోతే బ్యాడ్‌లక్..అంతే.' అని చెప్పుకొచ్చింది రష్మిక. ఇంకా చెబుతూ 'జీవితంలో కఠినమైన పాఠాలుండవ్. అన్నీ విలువైన పాఠాలే ఉంటాయి. మనం వాటిని తీసుకునే విధానంలోనే తేడా ఉంటుంది. ఈ సందర్భంగా అందరికీ నేనిచ్చే సలహా ఒక్కటే. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టి పెట్టండి. అప్పుడు మీ కుటుంబాలు కూడా బావుంటాయి.' అని పేర్కొన్నది రష్మిక మందన్నా.

రాజ్‌తో రిలేషన్‌షిప్...త్వరలోనే పెళ్లి

దూత వెబ్‌సిరిస్ నటి ప్రియా భవానీ శంకర్ వెల్లడి

'ధూత'వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ప్రియా భవానీ శంకర్ తాజాగా తన పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజ్ అనే వ్యక్తితో తాను దాదాపు పదేళ్ల నుంచి రిలేషన్‌లో ఉన్నానని తెలిపారు. వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని ఎప్పటినుంచో అనుకుంటున్నామని.. వచ్చే ఏడాది తప్పకుండా పెళ్లి చేసుకుంటామన్నారు. సినీ పరిశ్రమలోకి రాక ముందునుంచే రాజ్‌తో నేను ప్రేమలో ఉన్నా. మేమిద్దరం విడిపోయామంటూ ఇప్పటికే ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటివరకూ నేను చాలామంది నటులతో కలిసి వర్క్ చేశా. వారితో ఉన్న స్నేహం కారణంగా.. పుట్టినరోజు, లేదా ఏదైనా స్పెషల్ డే వచ్చినప్పుడు వారికి విషెస్ చెబుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టేదాన్ని. అలా, పెట్టడమే ఆలస్యం.. వారితో నేను రిలేషన్‌లో ఉన్నానంటూ వార్తలు వచ్చేవి. అదృష్టంకొద్దీ ఇప్పుడు ఆ తారలకు పెళ్లి కూడా అయింది అని ఆమె నవ్వుతూ చెప్పారు. చెన్నైకు చెందిన ప్రియా భవానీశంకర్.. 'మేయాద మాన్'తో నటిగా తెరంగేట్రం చేశారు. 2023లో విడుదలైన 'కళ్యాణం కమనీయం'తో ఆమె తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన ఆ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. అనంతరం ఆమె 'ధూత'లో నాగచైతన్య సతీమణిగా కనిపించి ప్రేక్షకులను అలరించారు.

ఒక్క ఏడాదిలో భాగ్యశ్రీ బోర్సే మూడు సినిమాలు

మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.

అదే నా చివరి చిత్రం కావొచ్చు అంటూ అమీర్ కామెంట్స్.. షాక్‌లో ఫ్యాన్స్

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమీర్ ఖాన్ చేయని ప్రయోగం లేదంటే అతిశయోక్తి కాదేమో. కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాలు చేసిన ఆయన ఎన్నో వెరైటీ పాత్రలు పోషించి అలరించారు. ఇప్పటికీ అదే శైలిలో నడుస్తున్నారు. అందుకే అభిమానులు ఆయనని ముద్దుగా బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అంటుంటారు. ఆమీర్ ఖాన్ త్వరలో 'సీతారే జమీన్ పర్' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ చిత్రం జూన్ 20న విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమిర్, తాను చాలా ఏళ్లుగా కలలు కంటున్న 'మహాభారతం' ప్రాజెక్ట్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. మహాభారతం చిత్రం అనేది తన చిన్నప్పటి కల అని అన్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతీ భావోద్వేగం, ప్రతి మానవ సంబంధం మహాభారతంలో కనిపిస్తుంది.ఈ సినిమా నా కెరీర్‌లో చివరి సినిమా కూడా కావొచ్చు అని ఆయన తెలియజేశారు. ఇలాంటి గొప్ప కథ తర్వాత నాకు ఇంకా ఏం చేయాలో కూడా అర్థం కాని పరిస్థితి. నాకు పని చేస్తూ చనిపోవాలని ఉంది కాని, బహుశా ఇదే చివరి సినిమా అవుతుందని ఆమీర్ అన్నారు. ఈ కామెంట్స్‌తో ఫ్యాన్స్ షాక్‌లో ఉండిపోయారు. మీరు ఎన్నో గొప్ప సినిమాలు చేయాలి, ఇప్పుడే రిటైర్మెంట్ ఆలోచన చేయకండి అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఆమిర్ ప్రస్తుతం మూడు ప్రాజెక్ట్స్ తో బిజీగా ఉన్నారు. 'హ్యాపీ పటేల్', 'చార్ దిన్ కీ చాందనీ', 'మహాభారతం'తో పాటు జోయా అక్తర్ సినిమాలో కూడా నటిస్తున్నారు. అయితే మహాభారతం మాత్రం ఆమిర్ డ్రీమ్ ప్రాజెక్ట్ అంటున్నారు. అయితే రాజమౌళి కూడా మహాభారతం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పినా%ొ% ఆయన ఆ వైపు అడుగులు వేయలేదు. అయితే జక్కన్న కన్నా ముందు ఆమీర్ ఖాన్ రంగంలో దిగడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. అయితే స్క్రిప్ట్ రాయడానికి టైం పడుతుందని.. పైగా అన్ని క్యారెక్టర్లను ఒకే సినిమాలో చూపించలేం కాబట్టి%ొ% సీరిస్ గా దీన్ని తెరపైకి తీసుకొస్తానంటూ పేర్కొన్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056